# రామాయణంలో నేను

(కథలు)



**వంశీ కమల్**

# రామాయణంలో నేను

వంశీ కమల్

Ramayanamlo Nenu

©Vamsi Kamal

ePublished by: kinige.com

# విషయ సూచిక


నాపేరు శ్రీరామ్ .......... 4

నా ఫొటోలో ఉన్నది నేను కాదు .......... 7

రామాయణంలో నేను .......... 11

శిల్పి .......... 14

ముసలోడు .......... 19

అభిప్రాయము .......... 22

నైతికం .......... 26

ఈ కాలం పిల్లలు .......... 32

ప్రేమ పెళ్లి .......... 36

మానవత్వం .......... 42

# నాపేరు శ్రీరామ్

తన పేరు జానకి.. రోజూ మా ఆఫీస్ లో కనిపిస్తూ ఉంటుంది. చాలా తెల్లగా, సరిపడా ఎత్తుతో, అందమైన మొహంతో చూపు తిప్పుకోలేని రూపం తనది. అప్పుడప్పుడు ఆఫీసులో కనిపిస్తూ ఉంటుంది. మొదట్లో పెద్దగా పట్టించుకోలేదు గానీ ఇప్పుడు మాత్రం ఎప్పుడన్నా కనిపిస్తే బావుణ్ణు అనిపించడం మొదలైంది.

ఇలాంటి మొహాలు పెళ్ళిచూపులకి వెళ్ళినపుడు ఎందుకు కనపడవా అని చాలాసార్లు నిట్టూర్చాను కూడా. ఇది తప్పు అని తెలుసు కానీ ఊహల్లోనే కదా అని, దూరం నుండే కదా అని తనని తనకి తెలియకుండా చూడడం మానలేదు. అలా అని మాట్లాడే ప్రయత్నమూ, ఎదురుపడే ధైర్యమూ చెయ్యలేదు.

ఒకరోజు లోకల్ రైల్వే స్టేషన్ లో ట్రైన్ కోసం ఎదురు చూస్తున్నాను. తను కనిపించింది. తన మొహం చూడాలనిపించింది. కొంచెం దగ్గరకు వెళ్లాను. ఇంతలో మేము ఎక్కవలసిన ట్రైన్ వచ్చేసింది. నాకు చాలా బాధేసింది. ట్రైన్ వచ్చింది. ఆగింది. కొంచెం కష్టంగానే రష్గా ఉన్న ట్రైన్ ఎక్కడం అనే పనికి ఉపక్రమించబోతూ తనని మరోసారి చూసాను. తను వచ్చిన ట్రైన్ ని పట్టించుకోకుండా దిగాలుగా కూర్చుంది. ట్రైన్ వెళ్ళిపోయింది నేను అక్కడే ఉండిపోయాను. నిజానికి తనకోసం నేను ఆగలేదు ట్రైన్ ఎక్కలేకపోయాను అంతే.

తడిచిన కళ్ళు తుడుచుకుంటూ నన్ను చూసింది. నాలుగు అడుగుల దూరంలో ఎదురుగా ఉన్న నన్ను చూసి దిగాలుగా చూసింది. నాకు ఏం చెయ్యాలి అర్థం కాలేదు. తనే వాటర్ బాటిల్ తీస్కుని ప్లాట్ఫార్మ్ చివరివరకు వచ్చి వాటర్ తో మొహం కడుక్కుని తుడుచుకుంటూ నావైపు చూసింది.

' మీరు కూడా ఇదే స్టేషన్ లో ట్రైన్ ఎక్కుతారా ? ' మాటలు కలిపింది.
' అవునండి ' సమాధానం ఇచ్చాను.

అలా మొదటి పరిచయం అయింది మాకు. తరువాతరోజు ఆఫీసుకు రాలేదు తాను. ఆ మరుసటి రోజు వచ్చింది. కానీ ఎందుకో ఈసారి తనని చూడాలనిగాని, పలకరించాలనిగాని చెయ్యొద్దు అని మనసు గట్టిగా చెప్తోంది. ఈ పరిచయం ఎక్కడికి దారి తీస్తుందో అని భయం వేస్తోంది. ఈ ఆలోచనలు అన్నీ పక్కన పెట్టి పనిలో పడిపోయాను. ఇంతలో తనువచ్చింది నా ప్లేస్ వెతుక్కుని.

' కొంచెం ఫ్రీ గా ఉంటే కాఫీ తాగి వద్దాం వస్తారా ? ' అని అడిగింది. కాఫీ ముగించి వచ్చేసాము. పనిలో పడిపోయాము. అదే రోజు నా నెంబర్ తీసుకున్న తను ఒక మెసేజ్ చేసింది.
' ఈవెనింగ్ స్టేషన్ లో వెయిట్ చేస్తారా ? కొంచెం లేట్ గా వెళ్దాం ' అని. నా మనసుకు నా ఆకర్షణకి మధ్య చిన్న యుద్ధం జరిగింది. నాకు నేను ఎందుకో పెద్దగా నచ్చడంలేదు. మనం కాని ఆలోచనలు గాని, మనం కాని పనులుగాని చేసేటప్పుడు వచ్చేలాంటి ఫీలింగ్ వచ్చింది.

సమయం సాయంత్రం ఐదు గంటలు. స్టేషన్ లో కూర్చుని ఉన్నాం. తాను తన గురించి చాలా విషయాలు షేర్ చేసుకుంది. తన లక్ష్యాలు, జీవితం మీద తన అభిప్రాయాలూ, తన వృత్తి పరమైన లక్ష్యాలు ఇంకా తన కుటుంబ విషయాలు ఇలా చాలా షేర్ చేసుకుంది. అలానే ఇంట్లో వాళ్ళు కనీసం ఎంక్వయిరీ చెయ్యకుండా ఒక సంబంధం ఓకే చెయ్యాలని చూస్తున్నారని, అబ్బాయికి తను నచ్చడమే చాలు అన్నట్లు పెళ్లి విషయంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు చెప్పింది. మంచి పొజిషన్లో ఉండి మంచి ఫామిలీ నుండి వచ్చిన అందమైన అబ్బాయి కావడం వల్ల వాళ్ళ పేరెంట్స్ కి వద్దు అనడానికి కారణాలేమీ కనపడలేదు అని నాకు అర్థం ఐయింది.

అతను ఎంత అదృష్టవంతుడూ అని నాకు అన్పించింది. అవును మరి ఇంత అందమైన మంచి అమ్మాయి దొరకడం అంటే మాటలా ? తన మాటలు వింటూనే నా ఆలోచనలు పరుగెడుతున్నాయి. ఇంతలో నా ఆలోచనలకి అడ్డుపడ్తూ ' మీరు నన్ను రోజూ చూస్తూ ఉండడం నేను చాలాసార్లు గమనించాను. మీ గురించి ఆఫీసులో అందరు చాలా మంచిగా మాట్లాడుకోవడమే విన్నాను తప్ప ఎవరూ ఎప్పుడూ తప్పుగా మాట్లాడడం వినలేదు. ఎవరో తెలియని వ్యక్తిని జీవితంలోకి ఆహ్వానించడం నాకు ఇష్టం లేదండి. జీవితం ఎలా ఉంటుంది అని మనం అంచనా వెయ్యలేము కానీ కొద్దిగా అయినా

ఎదుటి వ్యక్తి గురించి తెలిస్తేనే పెళ్లిచేసుకోవాలి అని నా నమ్మకం అండి. సో మీకు ఓకే అంటే మనం మిమ్మల్ని పెళ్లి చేస్కోవడం నాకు ఇష్టమే. అలోచించి చెప్పండి.' అని చెప్పింది.

నేను ట్రైన్ దిగి ఇంటి వైపు అడుగులు వేస్తున్నాను. ఆమె మాటలు చెవుల్లో మారు మ్రోగుతున్నాయి. చాలా తప్పు చేసిన ఫీలింగ్ నన్ను తొలిచేస్తోంది. తను నన్ను పెళ్ళికి ప్రొపొజ్ చేసింది అంటే నాకు తాను ఇష్టం అని తనకి అర్థం అయ్యేంతలా నేను ప్రవర్తించానా అనేది నాకు కష్టంగా ఉంది. ఇంటికి వెళ్లి తల స్నానం చేశాను. కళ్ళలో కొద్దిగా నీళ్లు తిరుగుతున్నాయి. టవల్ కట్టుకుని బయటకి వచ్చి ఫోన్ చేతిలోకి తీస్కుని ఒక మెసేజ్ పెట్టాను తనకి.

' మీ పేరెంట్స్ ఖచ్చితంగా మీ మంచి కోసమే అలోచించి ఉంటారు. ముందే కొట్టి పారెయ్యకుండా ఒకసారి ఆ అబ్బాయితో మాట్లాడి చూడండి. ఒక క్లారిటీ వచ్చాక నిర్ణయం తీస్కోండి. మీ ఆలోచనలకు సరిపోదు అని అనిపిస్తే ఏ క్షణాన అయినా సంబంధం క్యాన్సల్ చేసుకునే అవకాశం ఉంది. మీ పేరెంట్స్ కూడా చూస్తూ చూస్తూ మీకు ఇష్టం లేని పెళ్లి చెయ్యరని నా గట్టి నమ్మకం. ఒకసారి మాట్లాడిన తర్వాత ఒక మంచి నిర్ణయం తీస్కోండి. అలానే నా తరుపు నుండి క్షమాపణ కూడా స్వీకరించండి. నాకు పెళ్లి అయి ఆరు నెలలు అయింది. మీరు కొత్తగా జాయిన్ అవడం వలన అండ్ ఆ టాపిక్ ఎప్పుడూ మాట్లాడకపోవడం వలన మీకు తెలియకపోయి ఉండొచ్చు. గుడ్ నైట్'

ఒక్కసారిగా చాలా రిలీఫ్ అనిపించింది. నాకు నేను మళ్ళీ నాలాగ కన్పించాను.

ఇంతలో ' అన్నం వడ్డించమంటారా ? మీకిష్టమైన కూరతో భోజనం సిద్ధం ' కొంటెగా ప్రశ్నించింది నా భార్య. ఎందుకో ఈరోజు నాకు తాను చాలా గొప్పగా కన్పించింది. తేడా నా దృష్టిలోనే అని నాకు తెలుసు. తప్పటడుగులు వెయ్యడానికి చాలా అవకాశాలు వస్తాయి కానీ ఎప్పుడు ఉత్తమంగా ఉండడానికి చాలా నిబద్ధత ఉండాలి.

– వంశీ కమల్

# నా ఫొటోలో ఉన్నది నేను కాదు

ఈరోజు ఇల్లు మొత్తం గందరగోళంగా ఉంది. నేను గత రెండు రోజులుగా ఏడుస్తూనే ఉన్నాను. హర్షి ఫోటో స్టూడియో నుండి వచ్చినప్పటి నుండి ఇంట్లో ఒక్కరికి కూడా మనసు ప్రశాంతంగా లేదు. హర్షిణి మా అమ్మాయి ఐదో తరగతి చదువుతోంది. ఒక్కతే కూతురు. ఒక్కతే అంటే ముందు సారి కానుపు కష్టం అయి ఒక ఆడపిల్ల చనిపోయి పుట్టింది. తరవాత హర్షిణి పుట్టింది. చాలా గారాభంగా పెంచుకున్న పిల్ల. నిన్న దుర్గా హోమం జరిపి ఇల్లంతా అమ్మ రక్ష ఏర్పాటు చేసాము అప్పటి నుండి హర్షి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. నోరు విప్పడం లేదు. ఆఖరిసారి ఫోటో స్టూడియో నుండి వచ్చినపుడు మాట్లాడింది అరిచింది గొడవ చేసింది. పిచ్చి పట్టిన దానిలాగా ప్రవర్తించింది. అత్తయ్యగారు హోమం చేయిద్దాం మంచిది అన్నారు. సక్రమంగానే చేయించాము. కానీ, నిన్నటినుండి మౌనంగా ఉంది. డాక్టర్ కి చూపించాం. రిపోర్ట్స్ ఈరోజు వస్తాయి.

అసలు ఆరోజు బడిలో ఏదో దరఖాస్తు కోసం పిల్లలు అందరినీ ఫొటోస్ తీస్కుని రమ్మన్నారు. వాళ్ళ నాన్న తీసుకెళ్లి ఫోటో తీయించారు. తరవాత రోజు ఫోటో తెచ్చుకోడానికి వాళ్ళ నాన్న తను వెళ్లారు. అక్కడ స్టూడియో వాళ్ళు ఫొటోస్ ఇచ్చారట. హర్షిణి ఫోటో చూసి ఇది నా ఫోటో కాదు అని చెప్పిందట. అతను మరోసారి సరిచూసి నీదేకదమ్మా అన్నారు. వేరే ఎవరి ఫోటో నో చూపించి నాది అంటారేంటి ? అంటూ బిక్కమొహం వేసిందట. ఆశ్చర్యపోయి వాళ్ళ నాన్న ఆ ఫోటో చూస్తే సరిగ్గానే ఉందట. ఇంటికి తీసుకొచ్చారు. రావడంతోనే పుస్తకాల సంచీ విసిరికొట్టి ఏడవడం మొదలు పెట్టింది. నా ఫొటోలో ఉన్నది నేను కాదు అంటూ గొడవ మొదలు పెట్టింది. అందరం ఎంత నచ్చ చెప్పినా కూడా వినలేదు. చాలా గొడవ చేసి పిచ్చిగా ప్రవర్తించడం మొదలెట్టింది.

అత్తయ్యగారు మొక్కు తీర్చడం మర్చిపోయాము అందుకే ఇలా అని కంగారు పెట్టడంతో హోమం చేయించి ఇంటికి రక్ష కట్టించాము. అప్పటినుండి మాట్లాడడం మానేసింది. ఆసుపత్రికి తీసుకెళ్లి ఏవో పరీక్షలు చేసారు. ఇదంతా గుర్తు చేస్కుంటూ ఉండగా శేఖర్ గారు వచ్చారు. ఆయన మావారి

స్నేహితులు పేరుమోసిన వైద్యుడు. హర్షి నా ఒళ్ళో పడుకుని ఉంది. మావారు శేఖర్ గారు మాట్లాడుకుంటున్నారు.

' వినడానికి విచిత్రంగా ఉండొచ్చు రాజా. కానీ హర్షికి స్వరపేటికలో సమస్య ఉంది. అది పుట్టుకతో వచ్చినదానిలాగా ఉంది. దాని ప్రకారం తను చిన్నప్పటి నుండి మూగది అయి ఉండాలి. కానీ ఇన్నాళ్లు తను ఎలా మాట్లాడింది అనేది ఆశ్చర్యంగా ఉంది' అన్నారు శేఖర్ గారు.

'అదేంట్రా. నిన్నటి వరకూ చక్కగా మాట్లాడుతూ ఉన్న అమ్మాయిని పట్టుకుని అలా అంటావ్ ?' అడిగారు మావారు. నాకు అంతా అయోమయంగా ఉంది.

'అదే విచిత్రంగా ఉంది రా. నేను చాలా సార్లు మళ్ళీ మళ్ళీ సరిచూశాను. నేను చెప్పేది నిజం రా. మీ అమ్మాయి పుట్టుకతో మూగది' శేఖర్ గారు.

నాకు దుఃఖం ఆగడం లేదు. కానీ ఏమీ అర్థం కావడం లేదు. అత్తయ్యగారు ఏడవడం మొదలెట్టారు.

అప్పుడే అక్కడికి వచ్చిన పూజారిగారు అంతా వింటున్నారు. నా దగ్గరకు వచ్చారు ఏదో అర్థం అయిన వారిలా. నా ఒళ్ళో పడుకుని ఉన్న హర్షిని తన చేతుల్లోకి తీసుకుని ఇంటి బయటకు తీసుకుని వెళ్లారు. మేమంతా ఆయనని అనుసరించాము. తన మెడలో ఉన్న స్పటిక మాలని తాకి ఏదో స్మరించి ఆయన బొటన వేలు హర్షిని నుదుటి మీద ఉంచారు. ఒక్కరిగా ఏదో కుదుపుకు గురి అయినట్లు హర్షి కొద్దిగా వణికింది. నేను పట్టుకోబోయాను వద్దని చెప్పారు.

' ఎవరు నువ్వు ? ' అని హర్షిని ప్రశ్నించారు.

' నా పేరు వర్షిణి ' సమాధానం చెప్పింది హర్షిణి.

అందరం ఆశ్చర్యంతో ఒకరి మొహం ఒకరు చూసుకున్నాం.

' ఎందుకు ఈ పాపని పట్టుకున్నావ్ ?' మళ్ళీ గంభీర స్వరంతో అడిగారు పూజారిగారు.

' చెప్పను' అంది పాప

' చెప్పాలి. ఇంక నువ్వు ఈ పాపని వదిలి వెళ్ళాలి' గద్దించారు.

పాప చాలా ఏడ్చింది. ఎక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ తన కథ చెప్పింది.

' నా పేరు వర్షిణి. నాకు మా అమ్మ అంటే చాలా ఇష్టం. నేను అంటే మా అమ్మకి ఇంకా చాలా ఇష్టం. నేను కడుపులో పడిన దగ్గర నుండి మా అమ్మ నా గురించి ఎన్నో కలలు కంటూ రోజు ఎన్నో కబురులు

చెబుతూ ఎంతో ప్రేమించేది. నేను కూడా మా అమ్మని ఎంతో ప్రేమగా చూసుకోవాలి అనుకునే దాన్ని. నాకు వర్షిణి అనే పేరుకూడా మా అమ్మే పెట్టింది. నేను ఆడపిల్లని అయి ఉంటా అని తన నమ్మకం. ఆ నమ్మకంతోనే పేరు కూడా పెట్టేసింది. నేను కడుపులో ఉన్నప్పుడు మిక్కిలి జ్ఞానంతో ఉన్నాను కాబట్టి పర్వాలేదు కానీ బొడ్డు తాడు కత్తిరించగానే గతం మర్చిపోతానే అప్పుడు మా అమ్మ నాపై చూపించిన ప్రేమ మర్చిపోతానేమో అని భయంతో ఉండేదాన్ని. అనుకోకుండా ప్రమాదం జరిగి ప్రసవం కష్టం అయి నేను పుట్టకుండానే చచ్చిపోయాను. కానీ మా అమ్మని విడిచి ఉండడం నాకు ఇష్టం లేదు. అందుకే ఈ భూమిమీదనే తిరుగుతూ ఉన్నాను. మా అమ్మ కొన్నాళ్ళకి నన్ను మర్చిపోయి మళ్ళీ నెల తప్పింది. అప్పుడు నేను మా చెల్లిలో ప్రవేశించాను. అమ్మ ప్రేమను నేనే పొందాలని తన శరీరంతో పాటు పెరుగుతూ నన్ను నేనే మర్చిపోయాను. అద్దంలో చూసుకున్నపుడల్లా నాకు నారూపమే కన్పించేది. ఎప్పుడు అనుమానం రాలేదు. మొన్న ఫోటో తీసుకున్నపుడు కూడా మీ అందరికి కనిపించేది హర్షిణి రూపం అని నాకు నేను మాత్రం వర్షిణి లాగా కనిపిస్తున్నాను అనికూడా గుర్తు రాలేదు. మీరు హోమం చేసిన తర్వాత ఈ ఇంటిలోకి నాకు అడుగుపెట్టే అర్హత కోల్పోవడం వల్ల బయటకి రావాల్సి వచ్చింది. ఇప్పుడే నాకు అంతా గుర్తొచ్చింది. ' అని చెప్పింది

నాకు దుఃఖం కట్టలు తెంచుకుంది. నా బిడ్డకి నా మీద ఉన్న ప్రేమకి వెక్కి వెక్కి ఏడ్చి తనని పట్టుకున్నాను.

' క్షమించు అమ్మా. నా స్వార్థంతో చెల్లికి నీ ప్రేమ దక్కకుండా చేశాను. ఇప్పటికి నా తప్పు తెలిసింది. మళ్ళీ జన్మ అంటూ ఉంటే నీకే పుడతాను.' అంటూ వెళ్ళిపోబోయింది.

' ఆగమ్మ ఆగు వర్షి వర్షి ' అని నేను పిలుస్తున్నాను. అప్పటికే తను నన్ను వదిలి వెళ్ళిపోయింది. హర్షి కళ్ళు తిరిగి పడిపోయింది.

' ఒకసారి పిలవండి పూజారిగారు' అని అడిగాను

' క్షమించు తల్లీ. ఇంక నీ బిడ్డ ఆత్మ లాగా తిరిగదు. మరో తల్లి గర్భంలోకి వెళ్లాల్సిన సమయం వచ్చింది' అని చెప్పి వెళ్లిపోయారు.

అలా కొంతకాలం గడిచిపోయింది. హర్షికి మంచి వైద్యం చేయించాము. తనకి మాట్లాడడం వచ్చేసింది ఇప్పుడు. నాకు ఇప్పటికీ అర్థం కానీ విషయం ఒకటి ఉంది. నేనెప్పుడైనా పొరపాటుగా వర్షీ అని పిలిస్తే మాత్రం ఉన్న చోటే నిలబడి కాస్త నవ్వుకుని రెండు చేతులు నడుము మీద వేస్కుని కొంటెగా పరిగెత్తుకుంటూ వస్తుంది నా దగ్గరకి అచ్చం హోమం చేయించక ముందు హర్షిణి లాగా. తను నాతోనే ఉందేమో అని నా అనుమానం కూడా.

– వంశీ కమల్

# రామాయణంలో నేను

ఆరోజు ప్రతి రోజులానే నిద్రలేచాను. మాగన్ను నిదరలోనే చెయ్యి ఫోన్ కోసం తడిమింది. దొరకలేదు. చేతికి పచ్చగడ్డి లాంటిది తగులుతోంది. ఆశ్చర్యంగా అనిపించి కళ్ళు తెరిచి చూస్తే నేను పచ్చటి పచ్చికబయలు మీద ఉన్నాను. చప్పున లేచి నిల్చున్నాను. అంతా కొత్త ప్రదేశం. కనుచూపు మేరలో అంతా పచ్చదనమే. ఆకాశం కూడా ఎంతో నిర్మలంగా ఉంది. ప్రకృతిలో ప్రతి రంగూ చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఇన్నాళ్లూ నా కళ్ళు మసకబారిపోయాయో లేక ఇక్కడ గాలిలో స్పష్టత ఎక్కువగా ఉందో తెలియదు గానీ. సడన్ గా ఏదన్నా కంప్యూటర్ స్క్రీన్ సేవర్ లో ఉన్నానా ? అనిపించింది.

అడుగులు ముందుకు వేస్తున్నాను. ఒక తోటలాంటి పొలం. ఎలా చెప్పాలో తెలియడంలేదు. తోటలో గరికెలు అనుకుంటా. నడుస్తూ ఉన్నాను. ఒక పెద్దాయన కనిపించాడు. వెండిలాగా మెరిసే జుట్టు పెరిగిన మీసాలు  గడ్డాలతో ఋషి పుంగవునిలా ఉన్నాడు.

' ఎవరు నాయనా నీవు ? ఈ ప్రాంతం వాడిలా లేవు ? ' ప్రశ్నించాడు మహానుభావుడు.

' అవును స్వామి. నాకు అదే అర్థం కావడంలేదు. నేను ఇక్కడివాడిని కాదు. ' సమాధానం చెప్పే ప్రయత్నం చేశాను.

' నీ పేరు ఏమిటి నాయనా ? ' మళ్ళీ అడిగారు

' నా పేరు .. నా పేరు .. ' ఎంత ఆలోచిస్తున్నా గుర్తు రావడం లేదు. నాలో రగిలే ప్రశ్నల సునామీకి తోడు పేరు కూడా మర్చిపోవడం ఏంటి కామెడీ కాకపోతే.

' సరేలే పద నాయనా. దగ్గరలోనే ఆశ్రమం ఉంది ' నా పరిస్థితి అర్థం చేసుకున్నారు అనుకుంట.

' మీరు ఎవరు స్వామి ? ' నడుస్తూ అడిగాను

' నన్ను వాల్మీకి అంటారు. ' చెప్పారు

' కొంపదీసి రామాయణం రాసింది ... ' నసుగుతున్నాను

' అవును ఆ వాల్మీకినే ' అన్నారు.

మబ్బులు ఎగిరిపోయాయి. నేను స్థిరంగా ఉండి భూమి ఆకాశం గిర్రున తిరిగిన ఫీలింగ్. తర్వాత తెలిసింది దాన్నే తల తిరగడం అంటారని. మొత్తం చీకటి. ఏమైందో తెలీదు. కాసేపటికి నెమ్మదిగా కళ్ళు తెరిచాను. నా నుదిటికి పసరు రాసి నా అరికాలు మర్దనా చేస్తూ కనిపించాడు స్వామి. గబగబా కాళ్ళు లాక్కుని 'సారీ స్వామి .. అదే క్షమించండి ' అన్నాను.

' ఫరవాలేదు నాయనా. ఎందుకు మూర్ఛిల్లావో తెలుసుకోవచ్చా ?' అడిగారు.

' హై టెక్ సిటీ నుండి అడవిలోకి ఎందుకు వచ్చానా అని ఆలోచిస్తుంటే మీరు కాలం కూడా కాదు యుగమే మారిపోయింది అంటే మూర్ఛ పోకుండా ఇంకేం చెయ్యను స్వామి ?'

చిన్న చిరునవ్వు ఇచ్చాడు అయన.

' శ్రీరామరాజ్యంలో చూపిన సీతమ్మ తల్లి ఉండే ప్లేస్ ఇదేనా సామి ? ఆ మహాతల్లి ఉన్నారా ? ' అతృతతో అడిగాను.
' శ్రీరామరాజ్యంలో ఉండాల్సిన సీత ఇక్కడ ఎందుకు ఉంటుంది ?' ఈసారి ఆయన కన్ఫ్యూస్ ఐయ్యాడు. లోపల ఎక్కడో చిన్న ఇగో శాటిస్ఫాక్షన్.

' సామీ సామీ ఎవరో పునీత మన వనంలో శోకిస్తూ కూర్చుంది. నిండు గర్భిణి. ' ఒక బుడ్డోడు అరుస్తూ చెప్పాడు.

'అదిగో చెప్పనా స్వామి ??? ఆవిడ సీతమ్మ తల్లి.' అరిచాను.
ఆయన కొంచెం అయోమయంలో పడ్డారు. ' మహా సాధ్వీ శిరోమణి అడవిలో శోకించనేల ?' ప్రశ్నఅర్థకంగా
' రాములవారు పంపిస్తారు స్వామి ఎవరో ఏదో అన్నారని.. పదండి త్వరగా చూద్దాం' అంటూ ఉరుకుతున్నాను నేను. సీత మహా మాతని చూడబోతున్నాను అని ఉత్సాహంతో.

రిలాక్స్ రిలాక్స్ అంటూ ఆకాశవాణి లాగా అశరీర వాణి లాగా ఎదో గొంతు వినిపిస్తోంది. ఏమి రిలాక్స్ ఎవరు రిలాక్స్ ఏమీ అర్థం కావట్లేదు.

' నెమ్మదిగా కళ్ళు తెరవండి. నెమ్మదిగా తెరవండి. ఫరవాలేదు. ' అంటున్నారు ఎవరో పెద్ద బేస్ వాయిస్ వేసుకుని.
మేము సీతమ్మ కోసం అడుగులు వేస్తున్నాం. గొప్ప ఉప్పెనలాగా చప్పట్లు ఈలలు గోలలు మధ్య బలవంతంగా కళ్ళు తెరిచాను. విపరీతమైన వెలుగు. ఒక చెక్కబల్లమీద పడుకుని ఉన్నాను ఒక స్టేడియం లాంటి ఆడిటోరియం లో. నా పక్కన ఒక మైక్. పెద్ద పెద్ద స్క్రీన్స్ పెట్టి నా లైవ్ వీడియో ప్లే అవుతోంది. ఇప్పుడిప్పుడే గుర్తొస్తోంది కొన్నిగంటల క్రితం ఈ హైపో్నటిస్ట్ డెమో కోసం ఎవరన్నా రండి అంటే నేను వచ్చి పడుకున్నాను అని.

' ఇప్పుడు వరకు విన్నారు కదా ? ఒక మనిషి ని హైపో్నటిస్ చేసి ఒక వర్చువల్ వరల్డ్ లోకి పంపిస్తే ఎలాంటి ఇల్యూషన్ ఫీల్ అయ్యాడో ? మరొక్కసారి గట్టిగా చప్పట్లు' అంటూ అరిచి అరిచి చెప్తున్నాడు.

' ఛీ నీ ఎంకమ్మా ఇంకో ప్రయోగం చేస్తే చేసావు. ఇంకో పది నిముషాలు ఉంచొచ్చుకదా సీతమ్మని చూసేవాడిని' అని తిట్టుకుంటూ నిట్టూరుస్తూ నీరసంగా బల్లదిగి నా స్నేహితులవైపు అడుగులు వేసాను.

– వంశీ కమల్

# శిల్పి

సుందర మూర్తి మాస్టరు. క్రమ శిక్షణకు మరో పేరు. ఆయన దగ్గర చదువుకునే రోజుల్లో ఆయనంటే మాకు విపరీతమైన భయం, చాలా కోపం కూడా. చాలా చిన్న తప్పు చేసినా కూడా చాలా పెద్ద పెద్ద శిక్షలు వేసేవారు. ఆరోజుల్లో తల్లిదండ్రులు బడికి వెళ్లి మా అబ్బాయిని ఎందుకు కొట్టారని ప్రశ్నించేవారు కాదు. మావాడే ఏదో చేసుంటాడు అందుకే భయం చెప్పారు అనుకుని ఉపాధ్యాయులకు మమ్మల్ని వదిలేసేవారు. వారేమో మమ్మల్ని ఏకేసేవారు. మిగతా మాస్టర్లు ఎలా ఉన్నా, సుందరం మాస్టరు మాత్రం మమ్మల్ని బాగా హింసించేవారు. జీవితంలో ఎప్పుడు ఎలాంటి చిన్న అవకాశం వచ్చినా కూడా ఆయన మీద పగ తీర్చుకోవాలని మేమందరం అనుకునే వాళ్ళము. చదువు అయిపోయాక ఆయన మళ్ళీ మాకు గానీ మేము ఆయనకు గానీ కనపడలేదు. అలాంటిది ఈరోజు ఉదయం మా కార్యాలయంలో కనపడ్డారు. కిటికీ లోంచి నన్ను చూసారు. గుర్తు పెట్టారో లేదో తెలియదు. ఆయనకి ప్రభుత్వం నుండి కొంత నగదు రావాల్సి ఉంది. దానికి సంబంధించిన కాగితాలకి నా సంతకం అవసరం ఉంది. అందుకే ఆయన వచ్చారు. సాధారణంగా ఇలాంటి పని అన్నీ సక్రమంగా ఉంటే వెంటనే అయిపోతుంది. ఎందుకు అయినా మంచిదని ఒక రెండు రోజులు సమయం తీస్కొని పూర్తిచేస్తాం. దానికి ఒక రోజు సెలవ్ వచ్చి మా నిర్లక్ష్యం తోడైతే పది రోజులు అయినా పని పూర్తి కాకపోవచ్చు. అత్యవసరం అనుకున్న వాళ్ళు, వేచి ఉండలేని వాళ్ళు మా బంట్రోతు తృప్తి పరిచి ఫైల్ మా దగ్గరకి తెప్పిస్తారు. బంట్రోతు ఇంకా కొందర్ని తృప్తి పరచాల్సి ఉంటుంది. అది వేరే విషయం అనుకోండి.

మాస్టరుకి సంబంధించిన కాగితాలు నా దగ్గరకి వచ్చాయి కానీ నేను అవి పక్కన పెట్టేసాను. ఆయన చాలా సేపటి నుండే ఎదురు చేస్తున్నట్లున్నారు. నా పని నాది. ఇంతలో భోజనాల సమయం అయింది. ఈరోజు మా అబ్బాయిని బడి నుండి నేనే తీసుకుని రావాలి. మాస్టరు ఎదురుచూస్తున్నారు. నేను ఆయనకి సంబంధించిన కాగితాల వంక కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. పనికి కాస్త విశ్రాంతిని ఇచ్చి హడావిడిగా బయలుదేరాను. నేను వేగంగా బయటకి నడుస్తూ వెళ్తున్నాను. నా బంట్రోతు నాకు కొంచెం ముందుగా నడుస్తూ ఉన్నాడు. బయటకి రాగానే సుందరం మాస్టరు మరి

కొంతమంది లేచి నిల్చున్నారు. వాళ్ళ పని నేను చెయ్యాల్సిన వాడిని అనే గౌరవం చూపిస్తున్నట్లుగా. కానీ నేను కన్నెత్తి కూడా ఏ ఒక్కరినీ చూడలేదు. వేగంగా ప్రభుత్వ వాహనంలో మావాడి బడికి బయలుదేరాను.

ఒక అయిదు నిముషాలు కళ్ళు మూసుకున్నాను. వాహనం బడిని చేరింది.
వాహనాన్ని పక్కకి నిలిపి వాడికోసం వెతికాను. వాడు ఆట స్థలంలో ఒక చోట కూర్చొని ఉన్నాడు. అక్కడ ఏవో బొమ్మలు చేస్తున్నారు. మావాడు వాటిని చాలా శ్రద్ధగా గమనిస్తున్నాడు. ఒక శిల్పి ఒక పెద్ద రాయిని చెక్కుతూ ఉన్నాడు. వాడు దాని మీద నిలబడి మొహం చెక్కుతున్నాడు. చాలా చక్కటి కృష్ణుడి విగ్రహం అది. కొంచెం పెద్దగానే ఉంది. శిల్పి కి ఇంకా ఎక్కడా కూర్చుని లేదా నిలబడి మొహం చెక్కడానికి వీలు కాలేదేమో కృష్ణయ్య గుండెలమీద కాలు మోపి మొహం చెక్కుతున్నాడు. మండు వేసవి కాలం ఏమో రాయి చాలా వేడిగా పొగలు కక్కుతూ ఉంది. ఆ శిల్పి ఏ మాత్రం సంకోచించకుండా చెప్పులతో కృష్ణుడి గుండెల మీద నిలబడ్డాడు. మేము గుడిలో చూసి మొక్కే విగ్రహాన్ని గుండెల మీద తన్నుతున్నాడని చాలా కోపం వచ్చింది.

ఉండబట్టలేకపోయాను.

" ఏమయ్యా నువ్వేమన్నా నాస్తికుడివా ? ఏంటి ? ఏ మాత్రం సంకోచం లేకుండా స్వామి వారి గుండెల మీద కూర్చున్నావు ?"
" అబ్బే అదేం లేదయ్యా. నేను భక్తుడినే. కానీ తప్పు ఏమీ లేదయ్యా " అన్నాడు నిస్సంకోచంగా
" అలా తన్నేస్తూ తప్పులేదంటావేంటి ? " గట్టిగానే అడిగాను
" ఇదొట్టి రాయేనయ్య. ప్రాణ ప్రతిష్ట చేసి కోవెలలో నిలబెట్టే వరకు మాత్రం మా కళాకారులకి మాత్రం స్వామిని కాలితో తాకినా తప్పు లేదయ్యా. " చెప్పాడు
నేను ఆశ్చర్యపోయాను. " అదేంటి ? పాపం తాకదా ? " అడిగాను
" సృష్టిలో శిల్పికి మాత్రమే ఈ అర్హత ఉంది అయ్యా. గుళ్లో పెట్టేక మాత్రం అందరూ సమానమే అప్పటివరకూ మా కాలు తగిలినా అది మా పని కిందకి వస్తదిగాని పాపం కాదయ్యా " చెప్పాడు.

" ఓహ్ అలాగా ! నాకు ఇవాళే తెలిసింది " అని చెప్పి నెమ్మదిగా మా బుడ్డోడిని తీస్కుని బయలుదేరాను. మేమిద్దరం కార్యాలయానికి బయలుదేరాం. ఏవో కొన్ని ఆలోచనలు చుట్టుముడుతుండగా.

" నాన్నా .. ఎందుకు ఆ స్వామి ని అన్ని దెబ్బలు కొడ్తున్నారు ? నొప్పెయ్యదా స్వామికి ?" అడిగాడు నా కొడుకు

" లేదు నాన్నా. అన్ని దెబ్బలు తట్టుకుంటాడు కాబట్టే ఆయన దేవుడు ఐయ్యాడు. ఎన్ని దెబ్బలు కొడితే స్వామి విగ్రహం అంత అందంగా తయారవుతుంది. జీవితం కూడా అంతే నాన్నా మనం ఎంత ఓర్చుకుంటే అంత ఎదుగుతాం. చదవడానికీ, పని చెయ్యడానికి వెనకాడకుండా కష్టపడిన వాళ్లే జీవితంలో పైకి వస్తారు. అన్ని దెబ్బలు తిన్నాడు కాబట్టే మనం స్వామికి ఎన్నో పూజలు చేస్తాం " చెప్పాను

" మరీ సుత్తి ఇంకా సేన కూడా చాలా దెబ్బలు తింటోంది కదా నాన్నా ? మరి వాటిని ఎందుకు ఎవరూ గుర్తించట్లేదు ?" సూటిగా ప్రశ్నించాడు. ఒక్కసారిగా ఆశ్చర్యంగా నా కొడుకుని చూసాను. ఒక్క క్షణం నోట మాట రాలేదు.

శిల్పం కంటే కూడా ఎన్నో రెట్ల ఎక్కువ దెబ్బలు తింటూ సుత్తి, సేనా కళ్ళలో మెదిలాయి. ఇందాక మాట్లాడ్తున్నపుడు ఆ శిల్పి ఒంటినుండి కారిన చెమట రాయి మీద పడి బుస బుసమని ఆవిరి అయిపోవడం గుర్తొచ్చింది. వెంటనే ఆ శిల్పికి అన్నం తీసుకొచ్చిన నిండు చూలాలు ఐన అతని భార్య గుర్తొచ్చింది. ఆ పక్కనే విగ్రహం నమూనా కోసం తయారు చేసిన ఒక చిత్రపటం గుర్తొచ్చింది. ఓహో. ఈ లంకెలకి అంతం లేదు. ఎందుకో అకస్మాత్తుగా నాకు నేను గుర్తొచ్చాను. నన్ను ఉద్యోగస్తుడిగా చూడాలి అన్న మా అమ్మ గుర్తొచ్చింది. ఒక్కో రూపాయి దాచి పెట్టి చదివించిన నాన్న గుర్తొచ్చాడు. ఈ ఉద్యోగ ప్రయత్నానికి సంబంధించి సమాచారం ఇచ్చిన వాడు, దరఖాస్తుకు చిల్లర తక్కువగా ఇచ్చినా చూసి చూడనట్లు వదిలేసిన పుస్తకాల కొట్టు వాడు, నాలో పట్టుదల తగ్గకుండా ఎప్పటికప్పుడు నన్ను చైతన్య పరచిన నా ఉపాధ్యాయులు. నన్ను తిట్టి, కొట్టి చదివించిన అధ్యాపకులు ఇలా అనుకుంటూ అక్కడ ఆలోచన ఒక క్షణం ఆగింది.

" ఇప్పుడు సరిగ్గా మార్కులు తెచుకోకపోతే రేపు ఉద్యోగాలు రానప్పుడు తెలుస్తాది" అంటూ కొట్టి, తిట్టి, శిక్షించి చదివించిన సుందరం మాస్టరు గుర్తొచ్చారు. ఇంతలో కార్యాలయాన్ని చేరుకున్నాము. వాహనం దిగి రెండు అడుగులు వెయ్యగానే అలసి వెళ్లిపోతున్న మాస్టరు ఎదురయ్యారు. నా హృదయం ఎంతగానో కరిగిపోయింది.

" మాస్టరు గారు ! మీరా ? ఏం పని మీద వచ్చారు ?" ఆప్యాయంగా అడిగాను.

" ఒక అనుమతి కాగితం కోసం వచ్చాను. కనీసం పది రోజులు పడుతుంది అన్నారు. ఏం చెయ్యాలో తెలియక " అంటూ ఆ అనుమతికి సంబంధించిన వివరాలు చెప్పారు.

" ఒక్క నిమిషం ఉండండి మాస్టరు " అని లోపలకి వెళ్లి కాగితంతో గిర్రున తిరిగొచ్చాను. దాని మీద కావాల్సిన సంతకాలు చేసేసి రసీదు తీసుకొచ్చి " తీసుకోండి మాస్టరు. ఇది మీ దరఖాస్తు మాకు అందినట్లు రసీదు. ఎల్లుండికల్లా అన్నీ అనుమతులు పూర్తిచేసి మీ కాగితాలు మీ ఇంటికి తీసుకుని వస్తాను. మీరు నిశ్చింతగా వెళ్ళిరండి మాస్టరు" అన్నాను.

ఆయనకి కొద్దిగా కళ్ళలో నీళ్లు తిరిగాయి. "కూతురు పెళ్లి పెట్టుకున్నాను అయ్యా. సమయానికి ధనం కూడుతుందో లేదో అని కంగారు పడుతున్నాను. ఇక్కడ లంచం లేనిదే పని తొందరగా జరగదని నిరాశగా వెళ్ళిపోతున్నాను. ఇంతలో దేవుడులాగా " అంటూ నమస్కారంగా చేతులు దగ్గర చేసారు.

వారి చేతులు పట్టుకుని " నేను మీ విద్యార్థిని మాస్టరు. మీరు నేర్పిన విలువలు ప్రాణం ఉన్న వరకూ మర్చిపోను. నేను అవినీతికి పూర్తి వ్యతిరేకిని కాబట్టే ఇంత తక్కువ కాలపు సేవలోనే ఇన్ని బదిలీలు " నిజాయితీని ఎవరు గుర్తించరు. కానీ ఆ నిజాయితీకి కారణం అయినా మాస్టరు ముందు మొదటిసారి నిజాయితీగా ఉద్యోగం చేస్తున్నందుకు ఆరోజు నాకు చాలా గర్వంగా అనిపించింది.

"సంతోషం నాయనా .... " అంటూ మా బాబు వైపు చూసి " మీ నాన్న అంతటి వాడివి కావలి " అని దీవిస్తూ వెళ్లిపోయారు.

ఒక్క క్షణం అందరి నమస్కారాలు అందుకునే నన్ను తొక్కి పెట్టి నార తీసి ప్రయోజకుడిని చేసిన శిల్పి లాగా మాస్టరు కనిపించారు.

– వంశీ కమల్

# ముసలోడు

ఆ ముసలోడి పేరు దేవదాసు. రోజు పొద్దున్నే వచ్చి నా కార్ గ్లాస్ తుడిచి వెళతాడు. నాకు వాడు అంటేనే అసహ్యం. పైకి ఎగగట్టిన మాసిన పంచె తో, భుజం మీద ఒక తుండు గుడ్డ కప్పుకుని మాసిన గడ్డంతో పొద్దున్నే వస్తాడు. మా అపార్టుమెంట్ లో వేరే పని వాళ్ళు అందుబాటులో లేకపోడం వల్ల, కొత్తగా వచ్చిన నాకు ఈ ఏరియా ఇంకా అలవాటు కాకపోడం వల్లా వీడితో గ్లాస్ తుడిపిస్తున్నాను. నాకే కాదు మా కుక్కకి కూడా వాడు అంటే ఇష్టం ఉండదు. వాడు వాడి గార పళ్ళు. వాడు వస్తే చాలు మా కుక్క మీదకు దూకేయ్యడానికి చూస్తాది.

ఆరోజు శుక్రవారం. ఆఫీస్ కు లేట్ అయిపోయి హడావిడిగా బయల్దేరిన నాకు వెధవ మొహం వేస్కుని ఎదురువచ్చాడు.

' అయ్యా. దవాఖానకు పోవాలే పైసలిస్తరా ?' అతి వినయం నటిస్తూ అడుగుతున్నాడు. ఛీ పొద్దున్నే వీడి మొహం చూసాను ఏమవుతాదో అని మనసుకు పీకుతూ ఉంది.

' శుక్రవారం తప్ప మనీ అడగడానికి ఇంకో రోజు దొరకలేదా నీకు ? 250 రూపాయల కోసం ఏదో పెద్ద కాబూలీ అడిగినట్లు అడుగుతున్నావు. వెళ్ళు రేపు కనపడు' కసిరాను నేను. ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. ఇలాంటి వాళ్ళని ఇలానే అనాలి లేకపోతే ఆమ్మో.

శనివారం పొద్దున్న బైటకి వెళదామని కిందకి వచ్చాను. గ్లాస్ అంతా డర్టీ గా కనపడింది. ఎక్కడలేని కోపం వచ్చేసింది నాకు. వాడు ఇవాళ రాలేదు. ఎంత పొగరు. అడగ్గానే డబ్బులు ఇవ్వలేదని గ్లాస్ క్లీన్ చేయలేదు ముసలోడు. చాలా చిరాకొచ్చింది. ఒక గుడ్డముక్క తీస్కుని కష్టపడి నేనే గ్లాస్ క్లీన్ చేసుకున్నాను. ఈవెంట్ కి లేట్ అయిపోతోంది ఒక పక్కన. అసలు నాకు వచ్చిన కోపానికి ముసలోడు కనపడితే ఐపోయేవాడు ఈరోజు.

మా పాప కోసం పిజ్జా తీస్కొని ఇంటికి వచ్చాను. పాప చాలా సంతోషంగా తిన్నది. దానికి చాలా ఇష్టం. ఎవరో డోర్ బెల్ కొట్టారు. చూస్తే ఎవడో కుర్రోడు.

' సార్. మా తాత దవాఖానల కార్డు కోయించాలంట పైసలడగమనిండు. ' అనగానే అర్థం అయింది వాడు ఎవడో.

' పనికి రాకుండా డబ్బులు ఎలా అడుగుతాడురా మీతాత? రేపు పనికి రమ్మను. ఇస్తాను' అన్నాను నేను.

' జొరం సారూ తాతకి. పోనీ నేను వస్తా సరూ ' అన్నాడు.

' అడగగానే డబ్బులు ఇవ్వలేదని పొగరు చూపిస్తున్నాడు మీ తాత. డబ్బులు కావాలంటే రేపు వాడ్ని రమ్మను. లేకపోతే ఇంక రావొద్దని చెప్పు. ఇంకోక్కడ్ని చూసుకుంటాను' చాలా కోపంగా అన్నాను. మా పాప ఆ బుడ్డోడికి పిజ్జా మిగిలింది ఇవ్వాలని చూసింది. ఆ కుర్రోడు పొగరుగా వెళ్లిపోవడం నాకు అర్థం ఐయ్యింది. బలుపు ఎక్కువ ఈ వెధవలకి అని నాకు తెల్సు. అవతలికి పొమ్మని గట్టిగా చెప్పి మంచి పని చేశాను.

ఈరోజు రాత్రి ఎందుకో మా కుక్క చాలా అల్లరి చేసింది. నైట్ దాన్ని బయటకు తీసుకెళ్లి వచ్చాను. చాలా నిద్ర వచ్చేస్తోంది ఒక పక్కన. అలాగే దాన్ని సెల్లార్ లో వదిలేసి గబగబా వెళ్లి పడుకుండి పోయాను. తెల్లారినట్లుంది అలారమ్ మోగుతోంది. ఇంతలో మా కుక్క చాలా పెద్దగా మొరగడం వినిపిస్తోంది బైటనుండి పెద్ద పెద్ద కేకలు. ఏమైందో అని పరుగెత్తుకుంటూ వెళ్ళాను. ఆ ముసలోడు ఏదో చేసినట్లున్నాడు మా కుక్క వాడి మీద దాడి చేసింది. బాగానే కరిచినట్లుంది నేను పట్టించుకోలేదు. కుక్కని తీసుకెళ్లి కట్టేసాను. దాన్ని కంట్రోల్ చెయ్యడానికి నాకు చాలా టైం పట్టింది. ఈవెంట్ కి లేట్ అవుతాది అని రెడీ అవ్వడానికి పైకి వచ్చేసాను.

పైకి వెళ్ళాక మా ఆవిడ అడిగింది ఏమైంది అని ' ఆ ముసలోడు ఏదో కెలికినట్లున్నాడు టామీ ని అన్నాను ' .

'మీరు టామీ ని కట్టలేదా రాత్రి ' అని అడిగింది.

' ఏమో సరిగ్గా గుర్తు లేదు ' అని రెడీ అయి వీకెండ్ ఈవెంట్ కి బయలుదేరాను. ఈరోజు కూడా నా గ్లాస్ నేనే క్లీన్ చేసుకోవాల్సి వచ్చింది.

సాయంత్రం ఆరుగంటలు. చాలా నీరసంగా ఉంది. కాఫీ పెట్టమని అడుగుతాం అనుకుంటే మా ఆవిడ లేదు. చాలాసేపటి వచ్చింది.

' ఎక్కడికి వెళ్ళావ్ ? ' అడిగాను సమాధానం లేదు.

స్నానం చేసి వచ్చింది.

' అడుగుతుంటే సమాధానం చెప్పవేంటి ? ' అరిచాను.

కళ్ళలో నీళ్లు తిరుగుతూ చెప్పింది ' దేవదాస్ తాత ఇంటికి వెళ్లి వచ్చాను అని '

' అంత అవసరమా గలీజ్ వాళ్ళ ఇంటికి వెళ్లడం. పనీ పాట లేదు నీకు ' హుంకరించాను.

' మీకంటే వాళ్ళు గలీజ్ వాళ్ళు కాదండి.' అరిచింది.

ఏంటి నా మీద అరుస్తోంది. ఇది మొదటిసారి నాకు తెలిసి.

' మీకు కోపం వచ్చినా సరే అదే నిజం. మీ పొగరు మీ నిర్లక్ష్యం వాడి పేదరికం అన్ని కలిసి.. అన్నీ కలిసి ' ఎక్కిళ్ళతో ఏడ్చింది.

నేను దగ్గరకి వెళ్లబోయాను. అసహ్యంగా దూరం జరిగింది.

' మీకు ఏ కొంచెం మానవత్వం ఉన్నా ఈరోజు దేవదాసు చనిపోయే వాడు కాదు. కేవలం కేవలం మీవల్లే దేవదాసు తాత ప్రాణం కోల్పోయాడు. మీ అహంకారం వల్లే' ఏడుస్తూ బెడ్ రూమ్ లోకి వెళ్ళిపోయి డోర్ విసిరి కొట్టింది.

కాలి కింద భూమి కంపించినట్లు అనిపించింది.

– వంశీ కమల్

# అభిప్రాయము

మొదట ఆవిడని చూసినప్పుడు నాకు ఎలాంటి అభిప్రాయమూ లేదు. కానీ రెండోసారి చూసినపుడు ఆమె అందం కొంచెం ఆకర్షించింది. ఆమె వృత్తి ఏంటో తెలిసాక నా అభిప్రాయం మారిపోయింది. ఆమెపై గౌరవం తగ్గిపోయింది. కానీ ఇప్పుడు అలా కాదు.

ఈ సెలవుల్లో రద్దీగా ఉండే చోట ఒక మందుల షాప్ లో పనికి కుదురుకున్నాను. సెలవుల్లోనూ, వారాంతాల్లోనూ పని చెయ్యడం అలవాటు నాకు. అలా వచ్చిన పైకం నా చదువుకు ఎంతో సహాయపడుతుంది. అలా వచ్చిన పైకం లోంచి నా చదువుకు తప్ప ఒక్క పైసా కూడా వేరే దేనికీ ఖర్చుపెట్టను. రోజులాగానే నా పని సాగుతూ ఉంది. ఒకరోజు సాయంత్రం ఆమెని మొదటిసారి చూసాను. కొత్త చీర, పూలు, పౌడర్ రాసిన మొహం, చేతిలో ఒక చిన్న రుమాలు, చమ్కీలు ఉన్న చెప్పులు అన్నింటికీ మించి అందమైన రూపం. ఇవే నా మనసులో ముద్రించుకున్నాయి. వయసులో నాకంటే పెద్దనే. అలా చూస్తుండగానే ఆమె ఎదురు చూస్తున్న ఎవరో రావడం బండి మీద ఇద్దరూ వెళ్లిపోవడం జరిగింది.

మరుసటి రోజు సుమారు అదే సమయానికి మళ్ళీ వచ్చింది. మళ్ళీ ఎవరో వచ్చారు. ఏదో మాట్లాడుకుంటున్నారు. అతను వదిలేసి వెళ్ళిపోయాడు.
' కుదరలేదు అనుకుంటా ' అంటూ పగలబడి నవ్వుతూ మా యజమాని ఇంకా అతని స్నేహితుడూ కూడా అనుకోడం చూసాను. అప్పుడు వరకు నాకు తెలీదు మా యజమాని కూడా తనని రోజూ గమనిస్తున్నాడని. కాసేపు వీళ్లిద్దరి సంభాషణా విన్నాక చూచాయిగా ఆమె వృత్తి గురించి అర్థం ఐయింది. నాకు ఇదంతా జీర్ణించుకోవడానికే కష్టంగా అనిపించింది. ఇలాంటిది కొందరికి వృత్తిలాగా ఉంటుంది అన్న విషయం అప్పుడప్పుడే నాకు అర్థం అవుతున్న రోజులు. అదీ మొదటిసారి ఆమె వల్లనే తెలిసింది.
ఆరోజు నుండి సాయంత్రాలు ఆమె కనిపిస్తే నా కళ్ళు ఆమె వైపు తిరిగినా కూడా నా మొహం లో ఒకవిధమైన ఏహ్య భావం. ఏదో తెలియని అయిష్టత.

ఒక ఆదివారం సాయంత్రం ఆమె మా దుకాణానికి వచ్చింది. ఈరోజు ఎందుకో చాలా మాములుగా ఉంది. ఒక సాధారణ గృహిణిలానే ఉంది. అంటే తనని చూడగానే నా మనసులో ముద్రించుకున్న పూలు, పౌడి, మెరుపుల చెప్పులు ఇలాంటివి ఏమి లేకుండా చాలా సాధారణంగా ఉంది. పక్కన ఒక చిన్న పాపా ఉంది. వాళ్ళ అమ్మాయి లాగా ఉంది. నేను ఆమెనే గమనిస్తున్నాను. నేను ఊహించుకున్న అసహ్యించుకున్న ఆమెకీ ఈమెకీ చాలా తేడా ఉంది. మరీ అంత ఏహ్య భావన అయితే లేదు నాకు ఎందుకో. బహుశా ఆమె వాళ్ళ పాప తో నడుచుకునే విధానం ఎంతో ముచ్చటగా ఉండడం వలన అనుకుంటా. కొన్ని మందులు, పాపకి చాకోలెట్లు కొనుక్కున్నారు. ఆ పాప అమాయకత్వమైన నవ్వు, ఆ నవ్వుకు కారణం ఐన ఆమె ప్రేమ ఆమె గతం గురించి నన్ను ఆలోచించనివ్వట్లేదు.

ఒకరోజు హోరున వర్షం. చీకటి మా దుకాణం ముందుకు వచ్చి నిల్చుంది. ఏమి కావాలి అని అడిగాను. 'అండి' అని గౌరవం కూడా ఇవ్వలేదు. ఆమె ఏమి చెప్పకుండా కొంచెం కంగారుగా మా యజమాని కుర్చీ వైపు చూసింది. మళ్ళీ రెండు మూడుసార్లు అడిగాను. ఆమె ఏమీ లేదు అన్నట్లు తల ఊపింది. చాల సేపు అలానే దుకాణం దగ్గర తచ్చాడుతూ ఉంది. ఎవరన్నా గమనిస్తారని వెళ్ళిపోడం, మళ్ళీ వచ్చి మా యజమాని కోసం చూడడం చేస్తోంది. నేనే కల్పించుకుని ' మా యజమాని ఇవాళ రారు ' అన్నాను కొంచెం విసుగ్గానే. కొంచెం కంగారు పడింది. చీర కొంగుతో మొహం తుడుచుకుని. 'బాబు ఈ మందులు కావాలి. నా దగ్గర ఇప్పుడు డబ్బులు లేవు. మా పాపకి బాగోలేదు.' అంటూ చేతిలో మడతలు విప్పుతూ చీటీ చూపిస్తోంది. నాకు ఆ పాప నవ్వు గుర్తొచ్చింది. వెంటనే భారీ కాయుడైన మా యజమాని హుకుం గుర్తొచ్చింది. ప్రాణం మీదకి వచ్చిన వాడే మన దగ్గరకి వస్తాడు. జాలి చూపించే వ్యాపారం కాదు మనది. ఒక్క నయా పైసా కూడా మీరు జాలి చూపించి తక్కువ తీసుకున్నా జీతంలోంచి కత్తిరిస్తాను అనేవాడు. ఎందుకో తెలియదు ఎక్కువ సమయం ఆలోచించలేదు నేను. చీటీ తీస్కుని మందులు ఇచ్చి డబ్బులు ఎంత ఐయ్యాయో లెక్క వేసాను. 86 రూపాయలు అయింది. ఒక వరం నాకు ఇచ్చే జీతానికి చాలా దగ్గరగా ఉంది అది. నా పుస్తకాలు గుర్తొచ్చాయి. కళ్ళలో కొద్దిగా చెమ్మ వచ్చింది నాకు. కొంచెం కష్టమే అయినా ధైర్యం చెప్పుకున్నాను. ఒకరికి ఉపయోగపడని చదువు వల్ల ఎవరికీ ఉపయోగంలేదు. నా చదువుకు తప్ప దేనికీ ఉపయోగించని నా

సంపాదన మొదటిసారి ఒక పాప కోసం ఖర్చు కాబోతోంది అని కొంచెం తృప్తిగానే అన్పించింది. ఒక సంచిలో వేసి మందులు ఇచ్చేసాను. నా చేతిలోంచి గుంజుకుని వర్షంలో పరిగెత్తింది ఆమె.

ఎందుకో ఆరోజు మా అమ్మ దగ్గర పడుకున్నాను. నడుము చుట్టూ చెయ్యి వేస్కుని అమ్మ భుజం మీద తల పెట్టుకుని.

రెండు, మూడు రోజులు ఆవిడ కనపడలేదు. నేను ఆమె నుండి డబ్బులు తిరిగి ఆశించలేదు. యజమానికి మాత్రం జీతంలో తగ్గించాల్సిన సొమ్ముగా చెప్పాను. ఒకరోజు ఆవిడ మా దుకాణం వైపు రావడం చూసాను. మా యజమాని దుకాణంలోనే ఉన్నాడు. కొంగు ముడి విప్పుకుంటూ వస్తోంది. అది చూడగానే కంగారు వచ్చింది నాకు. డబ్బులు తిరిగి ఇవ్వడానికి వస్తుందేమో అని. నాకు ఆరోజు చాలా భయం వేసింది. మా యజమాని దగ్గర ఏం చిక్కులు వస్తాయో అని కొండంత కంగారు గుండెల్లో. ఇంతలో ఊహించిన దానికి వ్యతిరేకంగా జరిగింది. ఆమె కొంచెం దగ్గరకి రాగానే మా యజమాని కొంచెం కంగారు గల్లా పెట్టెలోంచి డబ్బులు తీసాడు. ఒక నాలుగు అనుకుంటా యాభై నోటు కాగితాలు గుప్పిటతో తీసుకుని కొంచెం బయటకి వొంగి ఆమె చేతిలో పెట్టి ' ఇదిగో డబ్బులు. దుకాణం దగ్గరకి మాత్రం రావొద్దని చెప్పానా ?' అంటూ కోపంగా భుజం పట్టుకుని తోసినట్టుగా అని కంగారుగా అటు ఇటు చూస్తున్నాడు. ఆమె కొంగు అప్పటియే విప్పి ఉంది అందులో డబ్బులు కన్పిస్తున్నాయి. ఒక యాభై కాగితం రెండు పది కాగితాలు ఇంకా చిల్లర కనిపిస్తోంది. ఆవిడ డబ్బులు తిరిగి ఇవ్వడానికి వస్తారని నేను ఊహించలేదు. ఆవిడ మందులు తీసుకున్న విషయం మా యజమానికి తెలియదు. కొంచెం వెనగ్గా నిల్చొని ఆమెకి మాత్రం కనపడేలాగా చిన్నగా సైగ చేశాను. డబ్బులు ఇవ్వకండి అని దణ్ణం పెడ్తున్నట్లుగా చెప్పాను. నన్ను యజమాని చంపేస్తాడు అని. ఆమెకి విషయం వెంటనే అర్థం అయింది.

యజమాని ఇచ్చిన డబ్బులు ఇంకా ఆవిడ తెచ్చిన డబ్బులు రెండూ కలిపి ముడి వేస్కుని నా వైపు చిన్నగా చూసి వెళ్ళిపోయింది. ఆవిడ మా యజమాని లేనపుడు నా డబ్బులు నాకు తిరిగి ఇచ్చేస్తారని ఆ చూపులో నాకు అర్థం అయింది. కానీ నేను యజమానికి చెప్పకుండా ఆవిడకు సాయం చేసాను

అని కృతజ్ఞతతో చూసిన చూపు అని అప్పటి కంగారులో నాకు అర్థం కాలేదు. ఆవిడ మా యజమాని కోపాన్ని, విసుగుని భరించారు తప్ప నేను ఇలా డబ్బులు ఇవ్వడానికి వచ్చాను నీ గురించి కాదు అని చెప్పలేదు. చెప్తే నాకు ఇబ్బంది అవుతుంది అని అంత వేగంగా అర్థం చేస్కుని నన్ను రక్షించిన ఆమెకి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాను. ఆవిడ వెళ్ళిపోయింది. అటు ఇటు దిక్కులు చూసి తిరిగి వచ్చి తన కుర్చీలో కూర్చున్నాడు మా యజమాని. వీడు ఆమెకి డబ్బులు ఎందుకు తిరిగి ఇస్తున్నాడా అని అర్థం చేసుకోడానికి నాకు ఎక్కువ సమయం పట్టలేదు. కానీ ఆరోజు ఆమె మీద ఎంతో హాస్యం చేసిన ఇతను ఇలాంటి పనులు చేస్తున్నాడు అనేది అతని మీద ఉన్న గౌరవాన్ని తగ్గించింది. అవసరాల కోసం గతి లేక ఆమె చేసే పనీ, ఆనందం కోసం భార్యను మోసం చేస్తూ ఈయన చేసిన పనీ ఒకటే కావొచ్చు. కానీ, దాన్నే వృత్తిగా తీసుకున్న వ్యక్తి ఆకాశమంత ఎత్తులోనూ, ఆ వృత్తిని అపహాస్యం చేసిన వాడు పాతాళం అంత లోతులోనూ కన్పించడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించే విషయం.

– కొన్ని నిజ సంఘటనల ఆధారంగా

# నైతికం

నా బలహీనతలు నాకు బాగా తెలుసు. అదే నా బలం. నేనేం చెయ్యలేనో నాకు తెలుసు కాబట్టే, చెయ్యగలిగిన వాటిని బాగా చెయ్యాలి. నాకు తప్పు, ఒప్పు అని ఆలోచించే ఓపిక మానాన్నతోనే పోయింది. నా చుట్టూ ఉన్న సమాజం ఒక వ్యాపారం అని మా నాన్న ప్రాణం ఖరీదు కట్టి మరీ నేర్పించింది నాకు ఈ సమాజం. మా చుట్టు పక్కల ఊళ్లలో బాగా ప్రచారం చేసిన ఒక సంస్థ అందరితోనూ రక్త దానం చేయించుకుంది. ఆరోగ్యంగా ఉన్న అందరం దానం చేశాం. దురదృష్టవశాత్తు నాన్నకి ప్రమాదం జరిగింది. ఆలోచన మేరలో ఒక్కరు కూడా కనపడలేదు దానం చెయ్యగలిగిన వాళ్ళు. ఎవరైతే మా అందరితో రక్తదానం చేయించారో వాళ్లనే వెళ్లి అడిగాము. ఉచితంగా ఇవ్వలేము అన్నారు. అదేంటి ? అని గొడవ చేసాము. మేము ఉచితంగా దానం చేసినా కూడా దాన్ని దాచి ఉంచడానికి వారికి ఖర్చు అవుతుందని పైసలిస్తేగాని ఇవ్వలేమని చెప్పేసారు.

యుద్ధం చెయ్యాలన్నంత కోపం ఉన్నా సమయం లేదు. ఎలాగో రక్తం తీస్కొని పరిగెత్తా ఆసుపత్రికి. చాలా ఆలస్యం అయిపోయిందని, ప్రమాదం జరిగిన వెంటనే తీసుకొచ్చి ఉంటే ఖచ్చితంగా బ్రతికేవారని చెప్పారు. అత్యంత బాధ కలిగించిన విషయం ఏంటంటే ? ప్రమాదవశాత్తు పడిపోయిన నాన్నని చూస్తూ మనకెందుకులే అనుకుంటూ చాలా మంది వదిలేసి వెళ్లడం. ఎప్పుడో ఎవరో మహానుభావుడు చూసి ఆసుపత్రికి తరలించాడు కానీ ఆలస్యం అయిపోయింది. పది రోజులు తిరక్కుండానే చుట్టాలు సహా అందరూ వదిలేసి వెళ్లిపోయారు. నేను, అమ్మ, చెల్లీ మిగిలాం. రెండ్రోజులకే పత్రాలు పట్టుకుని అప్పులోళ్లు వచ్చారు. ఒక్కసారిగా ప్రపంచానికి ఏమీ కానివారం అయిపోయాము. మా నుండి ముఖ్యంగా నాన్న నుండి సాయం పొందిన ఎందరి నుండో ఒక్కరన్నా మావైపు చూస్తారనుకున్నాను. జరగలేదు.

అప్పటి నుండి నాకు రెండే తెలుసు లాభం, నష్టం అంతే. ఈ పని చేస్తే నాకు లాభమా? నష్టమా? అనే ప్రశ్నకు సమాధానం మీదే నా నిర్ణయం ఆధారపడి ఉంటుంది. ఇక్కడే నా పయనం మొదలైంది అనుకున్నాను కానీ వ్యక్తిగా నా పతనం మొదలైంది అని తెలియడానికి సమయం పట్టింది.

నా మొదటి మోసం నా కుటుంబం ఆకలి తీర్చడంతో మొదలైంది. ఆరోజు మోసం చేసి మాత్రమే అన్నం పెట్టాలని గట్టిగా నిర్ణయించుకున్నాను. కొత్తగా వచ్చిన అప్లికేషన్లో భోజనం ఆర్డర్ చేశాను. డెలివరీ ఐయ్యాక కస్టమర్ కేర్ కి ఫోన్ చేసి అడిగింది కాకుండా వేరేది ఇచ్చావని గొడవ పెట్టుకున్నాను. వాడు క్షమాపణ చెప్పి, మీ డబ్బులు మీకు పంపిస్తాను మీ ఆర్డర్ వెనక్కి ఇచ్చేయండి మా డెలివరీ బాయ్ వస్తాడని చెప్పాడు. సరే అన్నాను. వాడు వచ్చాడు కానీ నేను మా ప్యాకెట్ తిరిగి ఇవ్వలేదు. మీ కంపెనీ వాడు క్షమాపణ చెప్పి ఫుడ్ డబ్బులు వెనక్కి వేసాడు తప్ప నీకు వెనక్కి ఇవ్వమని చెప్పలేదని దబాయించాను. వాడు వెళ్ళిపోయాడు. అప్పుడే తెలిసింది నోరు ఉంటే మోసం చేసినా దర్జాగా బతికెయ్యొచ్చని.

ఏదో మొదటిసారి పని పూర్తి అయిపోయింది. అన్నిసార్లూ ఇలా జరుగుతుందా ? ఏమిటి ? అనుకున్నదే తడవుగా ఒకసారి పరీక్షించుకోవాలి అనిపించింది. ఈసారి ఇంకాస్త తెలివైన వాళ్ళతో ప్రయత్నిద్దాం అనుకున్నాను. అటూ ఇటూ తచ్చాడుతూ ఒక పుస్తకాల కొట్టు దగ్గరకి వెళ్ళాను.
"ఏం కావాలి ? " అని కొట్టువాడు అడిగాడు. పక్కన ఎవరో రెవిన్యూ స్టాంప్స్ కొనడం చూశాను. "రెవిన్యూ స్టాంప్స్ ఎంత?" అని అడిగాను. "రెండు రూపాయలని" చెప్పాడు. "పోస్ట్ ఆఫీస్ లో ఒక్క రూపాయే కదా ?" అని అన్నాను. "అయితే అక్కడే కొనుక్కో" అని కోపంగా స్టాంప్స్ లోపల పేట్టేశాడు. ఏమిటబ్బా వీడి ధైర్యం అనుకున్నాను. అడక్కుండానే పక్కన అంకుల్ చెప్పాడు. మా ఊరు పోస్ట్ ఆఫీస్ కి రెవిన్యూ స్టాంప్స్ రాగానే వీళ్ళు కొనేసుకుంటారట. ఆలోచించాను.

మరుసటి రోజు గ్రంధాలయం దగ్గరకి వెళ్ళాను. ఏదో సంపాదించేద్దామని కాదుగాని ఈ పనులు బహు సరదాగా అనిపిస్తున్నాయి. గోడ మీద ఒక పోస్టర్ అంటించాను.

2015, 2016 లో బి. కామ్. మరియు బి. టెక్. చదివిన విద్యార్థులకి ఉద్యోగ అవకాశాలు కలవు. ప్రవేశ రుసుము లేదు. వివరాలకై స్వంత చిరునామా గల ఇన్వెలప్ మీద రెండు రెవిన్యూ స్టాంపులు ఒక ఐదు రూపాయల స్టాంప్ అంటించి క్రింది చిరునామా కి పంపగలరు అని మా తాతయ్యగారి అడ్రస్ ఇచ్చాను. నాలుగు రోజుల్లో సుమారు ఎనభై కవర్లు వచ్చాయి. నాకు భలే నవ్వొచ్చింది. కనీస ఇంగిత జ్ఞానం లేని వీళ్ళందరూ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారా అని. చక్కగా స్టాంపులు అన్నీ పీకి అదే పుస్తకాల కొట్టులో అమ్మేసాను. మాములు స్టాంపులు కొనను అన్నాడు. ఉచితంగా ఇచ్చేసాను. ఇలా నా విజ్ఞాన ప్రదర్శన మొదలైంది. మొదట్లో చాలా సరదాగానే ఉండేది. ఆ సరదాల్లో పడి శారద అనే అమ్మాయి వెంటపడి ఏడిపించడం కూడా మొదలు పెట్టాను. సరదాగా మొదలైనవి ఇప్పుడు అలవాట్లుగా మారిపోయాయి. అలవాటు అవ్వగానే సరదా తగ్గడం. మళ్ళీ సరదా కోసం మరో కొత్త అలవాటు చేసుకోడం.

ఇప్పుడు నేను దారిలో ముక్కు మొహం తెలియని వాడు చూసినా కూడా ఛీ అనుకునేలా తయారయ్యాను. పరిచయంలేని వాళ్ళు కూడా అసహ్యించుకునేంత దిగజారిపోయింది నా విలువ. ఇంత తెలివైన వాడిని కొంచెం కూడా విలువలేనివాడిగా ఎందుకు అయిపోతున్నానో అనే ప్రశ్న మొదలైంది. నాలో విలువలు లేకపోవడం వల్ల అని నాకు అప్పటికి తెలియలేదు. కానీ ఆత్మ పరిశీలన బాగా ఎక్కువైంది. నాన్న దూరం అయిన ఆరునెలలలోనే నాలో వచ్చిన మార్పులు గమనించడం వల్లనో తెలీదు, అందరి ముందు మంచివాడు అనిపించుకోవాలనే కోరిక వలనో తెలియదు. మనిషిని ఏ ఒక్క కారణమో, సంఘటనో మార్చలేదు. అంతకు ముందే అంతర్లీనంగా మార్పు కోరుకునే మనసు ఉండాలి. అప్పుడే కొన్ని సంఘటనలు ఉత్ప్రేరకంగా పని చేస్తాయి. అలాంటి రోజొకటి నా జీవితంలోకి వచ్చింది.

అంతా బాగానే చేశాను అనుకుంటూనే ఒక చిన్న పొరపాటు చేశాను. ఆన్లైన్ లో ఆపిల్ ఫోన్ ఆర్డర్ చేసి ఫోన్ బదులు రాళ్లు వచ్చాయని ఫిర్యాదు చేసి మోసం చేసే ప్రయత్నంలో పొరపాటున నా మీద నిఘా ఉన్న ఫోన్ నెంబర్ వాడేసాను. వెంటనే అర్థం అయ్యింది. సిమ్ కార్డు తీసి పారేసాను. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయినట్లుంది. మా ఇంటికి ఒక పోలీస్ జీప్ వచ్చింది. ఒక ఆఫీసర్ జీప్ దిగి ఇంట్లోకి వస్తున్నాడు. పారిపోడం నా నైజం కాదు. బహుశా అదే నన్ను కాపాడిందేమో. గబగబా

పరిగెత్తుకుని కింది గదిలోకి వెళ్ళాను. ఆరడుగుల ఆజానుబాహువైన ఆఫీసర్ అప్పుడే గడప దాటి లోపలికి వచ్చాడు. వెనకాలే ఒకమ్మాయి వచ్చింది. తను మరెవరో కాదు. శారద.

"వీడేనా ?" అని అడిగారు ఆఫీసర్. నేను ఆశ్చర్యపోయే సమాధానం ఇచ్చింది శారద "అవును డాడీ " అని. పోలీస్ కూతురిని ఏడిపించానా ? అయిపోయాను అనుకున్నాను. నిప్పు కణికల్లా మండుతున్న ఆయన కళ్ళు మా నాన్న ఫోటో మీద పడ్డాయి. ఒక్కసారిగా ఆయన వదనం కోపంనుండి సాధారణ స్థాయికి చేరింది.

"ఆయన కొడుకువా? నువ్వు ?" అనుమానంతో ఒక రకమైన బాధ మొహం పెట్టి అడిగారు

"హా అవునుసర్ " అన్నాను

" ఆయన కడుపున పుట్టి తప్పుడు పనులు చెయ్యడానికి సిగ్గుగా లేదా?" ప్రశ్నించారు

" లేదు " అన్నాను. ఆయనకి కోపంవచ్చింది. నా తల బిరుసుతనానికి.

" ఇక్కడ అందరూ మోసమే చేస్తున్నారు సర్. సమాజంలో కొంచెం మానవత్వం ఉన్నా మా ఇంటికి నేను యజమానిని అవ్వాల్సి వచ్చేది కాదు సర్. ఎవరికైనా ప్రమాదం జరిగితే మనం ఏం చేయగలమో చేద్దాం అని పరిగెత్తుకు వచ్చే వారికన్నా, ఎవరో ఒకరు వస్తారులే అని పక్కనుండి వెళ్లిపోయేవారే ఎక్కువ సార్. ఆ ఎవరో ఒకరు వచ్చి ఆసుపత్రికి తీసుకొచ్చే వరకు మా నాన్న ప్రాణం ఆగలేకపోయింది " మొదటి సారి నా మనసులో మాటలు కన్నీళ్లతో బయటకి వచ్చాయి. "ఆయన కొంచెంసేపు ఓపిక పట్టినా, బ్లడ్ ప్యాకెట్ తొందరగా దొరికినా మా జీవితాలు వేరేలాగా ఉండేవి " కళ్ళ నీళ్లతోనే చెప్పాను.

" తప్పు చేసే ప్రతి ఒక్కడికీ కారణాలు ఉంటాయి. నీకు ఎదురైన సంఘటనల్లో ఉన్న వ్యక్తులు తప్పే చేసుండొచ్చు అంత మాత్రాన నీ తప్పు తప్పు కాకుండా పోదు " అన్నారు

తలదించుకున్నాను.

ఆయన చెప్పడం మొదలు పెట్టారు.

" తప్పు చేసే ప్రతి ఒక్కడికీ కారణాలు ఉంటాయి. సమర్థించుకున్నంత మాత్రాన తప్పు ఒప్పు అవదు. సంఘటనల ప్రభావం వలనో, సరదా వలనో ఇలా ఆలోచించడం మొదలెట్టావని నమ్ముతున్నాను. అందుకే చిన్న కథ చెప్తాను. ఓపిక లేకపోయినా విను.

కొన్ని సంవత్సరాల క్రితం ఇద్దరు మిత్రులు ఉండేవారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నాల్లో ఉన్నారు. ఇద్దరికీ అవకాశం వచ్చింది కానీ లంచం అడిగారు. ఒకడు అప్పు చేసి ఉద్యోగంలో చేరాడు. రెండో వాడు తప్పు చెయ్యనని అప్పటికి నిరుద్యోగిగా ఉండిపోయాడు. తర్వాత చిరుద్యోగిగా జీవితం నెట్టేశాడు. కారణం ఒక్కసారి చేసినా కూడా తప్పు తప్పే అని. ఈకాలపు ఆలోచనలతో ఉన్న మొదటివాడు ఈ ఒక్కసారి తప్పు చేసి అయినా స్థిరపడిపోతే ఇకపై నీతిగా ఉండొచ్చు అనుకున్నాడు. కానీ లంచం కోసం చేసిన అప్పులు, లంచం తీస్కున్నవాడి కిందే ఉద్యోగం కావడం వల్ల ఒత్తిడితోనూ మరి కొన్ని తప్పులు చెయ్యక తప్పలేదు. పరిస్థితుల కోసం తప్పు చేస్తూ పోతే అది అలవాటు గాను వ్యసనంగాను మారిపోతుందని తెలిసిన అతను ఎదిరించాడు. ఇక్కడితో ఈ నీతిలేని జీవితానికి ముగింపు చెప్పాలనుకున్నాడు. అది ఎవరికీ రుచించలేదు. ఒత్తిడులూ, బదిలీలు ఎక్కువయ్యాయి. చిన్న చిన్న పనులు చేసుకోడానికి కూడా ఆటంకాలు సృష్టించేవారు తమదారిలో తీసుకుపోడానికి. తన మిత్రుడిని గుర్తు చేస్కుంటూ స్ఫూర్తి పొందుతూ పరిస్థితులతో పోరాడుతూ ఉండే వాడు. కానీ ఒకరోజు విలువైన ఉద్యోగమా ? విలువలా అనే పరిస్థితి వచ్చింది. స్నేహితుడు గుర్తొచ్చాడు. ఉద్యోగం వదిలేసాడు. ఉద్యోగంలో రేపే ఆఖరి రోజు అనగా ఈరోజు ఒక ముఖ్య సంఘటన జరిగింది అతని జీవితంలో.

తన జీవితంలో స్ఫూర్తి నింపి చాలా కలం క్రితం తనకు దూరం ఐన స్నేహితుడు చనిపోయాడనీ, అతని కొడుకు తప్పుదారిలో నడుస్తున్నాడనీ తెలిసి మనసుకు బాధ కలిగింది. నీకు అర్ధమయ్యే ఉంటుంది. ఆ మొదటి మిత్రుడు మీ నాన్న. రెండో మిత్రుడు నేను. " ఆయన కళ్ళలో నీళ్లు తిరుగుతున్నాయి.

" నాలాంటి మా మిత్రుల ఎందరి జీవితాల్లోనో విలువలు నింపిన మీనాన్న పెంపకంలో నువ్వు ఇలా తయారయి ఉంటావని నేనైతే నమ్మను. లోపలెక్కడో నేను ఇది కాదని, నేను నాలా ఉండాలనే ప్రశ్న నీ మనసులో ఉదయించిన రోజున నన్ను కలువు. మీ నాన్నకి ఏమీ చెయ్యలేకపోయాను. నేను

మొదలెట్టబోయే వ్యాపారంలో నీకు కూడా నీతిగా సంపాదించుకునే అవకాశం ఇస్తాను. లేదు నేను ఇలానే ఉంటాను ఇదే నేను అనుకుంటావా? నువ్వు నా స్నేహితుడి కొడుకువి అని దయచేసి ఎవరికీ చెప్పకు." చేతిలో విజిటింగ్ కార్డు పెట్టేసి చాలా ఖరాఖండిగా చెప్పేసారు.

ప్రపంచంలో ఏ మనిషీ కూడా పక్కవాళ్ళ మాటలు విని మారిపోరు. లోపల ఎక్కడో తమకి మారాలని ఆలోచన ఉండి ఏదైనా బలమైన సంఘటన జరిగినపుడు తన నిజమైన నడవడికలోకి అడుగు పెడతాడు. అలాంటి సంఘటనే అప్పుడు జరిగింది. ఈయన అలా వెనుతిరగగానే మా అమ్మా, చెల్లీ ఇంట్లోకి వచ్చారు. బయట ఎవరో బాగా భయపెట్టి ఉంటారు పోలీసు మీ ఇంటికి వచ్చారని. రావడంతోనే కనీసం మొహం కూడా చూడకుండా ఆయన కాళ్ళ మీద పడిపోయింది అమ్మ. ఒక్కసారిగా నా గుండె పగిలిపోయింది. ఒక్క క్షణం 'అమ్మా' అని పిలిచినా కూడా గొంతు పెకల్లేదు.

" నా బిడ్డ ఏం తప్పు చేసాడో తెలియదు. కానీ దయచేసి వాడిని క్షమించండి. వాళ్ళ నాన్న దూరం ఐయ్యేసరికి మనసు విరిగిపోయి తప్పుడు దారిలో పడ్డాడు సార్. ఇన్నాళ్లు వాడే మారతాడని వదిలేసాను సార్. ఇప్పుడు నేను చెప్పి మార్చుకుంటాను. దయచేసి ఈసారికి క్షమించండి" అని మా అమ్మ భోరున ఏడుస్తూ బ్రతిమిలాడుతోంది.

"సరేలేమ్మా. ఈసారి జాగ్రత్తగా చూసుకో" అంటూ వాళ్ళమ్మాయి చెయ్యి పట్టుకుని ధారగా కారుతున్న కన్నీళ్లు తుడుచుకుంటూ, ఆయన ఫలానా అని చెప్తే మా అమ్మ ఇంకెంత చిన్నతనం ఫీల్ అవుతాదో అని పలకరించకుండానే వెళ్లిపోయారు.

జరిగిన సంఘటనలన్నీ అర్థం చేసుకున్న శారద వాళ్ళ నాన్న వెహికల్ డ్రైవ్ చేస్తూ ఆయన్ని తీస్కెళ్లిపోయింది. నేను గోడకి జారబడి కిందకి కూలబడిపోయాను. ఒక చేతిలోకి ఆయన ఇచ్చిన విజిటింగ్ కార్డు, మరొక చేతిలోకి నాన్న ఫోటో తీస్కుని పశ్చాత్తాపంతో ఎక్కిళ్ళు ఆపుకుంటూ ఏడ్చేశాను.

– వంశీ కమల్

# ఈ కాలం పిల్లలు

ఈరోజు మా ఇంట్లో అందరం ఎంతో సంతోషంతో ఉన్నాం. మాఅమ్మాయి పదో తరగతిలో మా టౌన్ కి ఫస్టవచ్చింది. నాకు చాలా గర్వంగా అనిపించింది. అందరూ ముందు మెచ్చుకోవడం వెంటనే "తర్వాత ఎక్కడ చదివిస్తారని" అడగడం. అలా అడిగిన వాళ్లలో కొందరి సలహా తీసుకుని తన భవిష్యత్తు బావుంటుంది అని మాకు భారంగా ఉన్నా కూడా ఒక పెద్ద పేరుమోసిన కార్పొరేట్ కాలేజీలో చేర్పించాం.

కానీ దురదృష్టం. మా అమ్మాయికి మమ్మల్ని వదిలి హైదరాబాద్ వెళ్లి అందరికీ దూరంగా హాస్టల్ లో ఉండడం ఇష్టం లేదు. చాలా నచ్చ చెప్పాము వినలేదు. బ్రతిమిలాడం వినలేదు. మొదట్లో మొరాయించినా కూడా తానే మారుతుందని బలవంతంగా చేర్పించేసి వచ్చాము. అక్కడ చదువు తప్ప ఇంకే వ్యాపకాలు ఉండవు. వేరే ఆలోచనలేవీ ఉండవు. మొదట్లో వారం వారం వెళ్లే వాడిని. ఎందుకో అక్కడ పిల్లలెవరి మొహాల్లోనూ సంతోషం కనపడేది కాదు. బిక్కు బిక్కుమంటూ ఉండేవారు. చిన్న పిల్లలు కదా ఇల్లు వదిలి రావడం వల్ల వచ్చిన బెంగ అని అనుకున్నాను.

ఒకమ్మాయి పిలిచింది. ఏంటమ్మా అని అడిగితే ఒకేసారి ఫోన్ ఇస్తారా? ఇంటికి చేసుకుంటాను అంది. సరేనమ్మా అని ఇచ్చాను. వాళ్ళ డాడీ అనుకుంటా. ఎందుకు రాలేదని గొడవ పెట్టుకుని ఏడుస్తూ మాట్లాడుతోంది. అప్పుడు గమనించాను. అక్కడున్న ప్రతి అమ్మాయి ఎవరో ఒకరి ఫోన్ తీస్కుని మాట్లాడ్తూనే ఉన్నారు. ఈ పాప ఫోన్ తిరిగి ఇవ్వగానే మరో అమ్మాయి తీసుకుంది. నేను మా బంగారం తో బెంచ్ మీద కూర్చున్నాను. తను చాలా బెంగగా ఉంది. నన్ను తీస్కెళ్ళిపో డాడీ అని ఏడవడం మొదలు పెట్టింది. ఆరోజు నచ్చజెప్పడానికి చాలా కష్టం అయింది. లోపలెక్కడో నాకు కూడా కొంచెం బాధగానే అనిపించింది కానీ ఇది సరి అయిన సమయం ఇప్పుడు చదువు మీద ధ్యాస పెట్టకపోతే ఈ పోటీ ప్రపంచంలో పిల్లలు ఏమైపోతారో అని భయం.

కొద్ది రోజులకి హోమ్ సిక్ హాలిడేస్ ఇచ్చారు. కొంచెం మోహంలో వెలుగు కనపడింది. రోజు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి దగ్గరకి వచ్చేది. కొంచెం సేపు కబుర్లు చెప్పి నా ఫోన్ తీస్కెళ్ళిపోయి వాళ్ళ ఫ్రెండ్స్ తో మాట్లాడుకుంటూ ఉండేది. పోనిలే కొంచెం మాములుగా ఉంటోంది అని నేను పెద్దగా పట్టించుకునే వాడిని కాదు. అలా తనకి ఫోన్ బాగా అలవాటు అయిపోయింది. కొత్త ఫోన్ కొని ఇమ్మనడం మొదలు పెట్టింది. నేను ఇవ్వలేదు. ఇప్పటినుండి ఫోన్ వద్దని నా ఉద్దేశం. ఇప్పుడు ఫోన్ కోసం గొడవ చెయ్యడం మొదలు పెట్టింది. అలా పోరు పెడుతూనే కాలేజీ కి మళ్ళీ వెళ్ళిపోయింది. ఈ సారి నేను హాస్టల్ కి వెళ్ళినపుడు కూడా గమనించాను వెళ్ళగానే ఫోన్ తీస్కోడం దానితోనే గడపడం. కొంచెం చిరాకేసింది. కానీ ఇంటి బెంగ అయితే పోయింది కదా అని తేలికగా తీసుకున్నాను అదే తన ప్రాణాల మీదకి తెస్తుందని అనుకోలేదు.

ఇంతలో దసరా సెలవలు ఇచ్చారు. ఫోన్లో చాట్టింగులు ఎక్కువ ఐయ్యాయి. అబ్బాయిలు అమ్మాయిలు అని లేకుండా చాటింగులు చేసేది. ఒకరోజు షాప్ కి బయటకు వెళ్లిన మా అమ్మాయి మీద ఒకడు దాడి చేసాడు. ప్రేమిస్తున్నాను అని చెప్తే కాదు అన్నందుకు క్రూరంగా దాడి చేయబోయాడు. అదే సమయానికి నేను అటే వెళ్తుండడంతో రక్షించుకోగలిగాను. పోలీస్ లకి పట్టించి బలంగా కేసు కూడా పెట్టాను. వాళ్ళ నాన్న వచ్చి బ్రతిమిలాడారు. ఆయన నాకు తెలుసు. ఆయనొక సంఘ సంస్కర్త. సమాజ సేవా కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. అలాంటి వారికీ ఇలాంటి అబ్బాయి పుట్టాడా అనుకున్నాను. ఎంతైనా పెంపకంలో ఉంటుంది. ఆయన సమాజ సేవ అంటూ తిరిగి పిల్లాడు ఎలాంటి తిరుగుళ్ళు తిరుగుతున్నాడో గమనించలేకపోయాడు. " ఇప్పటి కాలం లో పిల్లల్ని పద్ధతిగా పెంచడం కూడా సమాజ సేవే సార్. ఇలాంటి వాళ్ళని మాలాంటి వాళ్ళ మీదకి వదిలేసి మీరు సేవ అంటూ తిరగడం హాస్యాస్పదం. ఇకమీదట ఇలా జరగకుండా చూస్కోండి" అని గట్టిగా హెచ్చరించి కేసు వాపసు తీస్కుని నా బిడ్డని తీస్కుని ఇంటికి వచ్చేసాను. ఎంతైనా మన పిల్లల మీద మనకి చాలా ప్రేమ, నమ్మకం ఉంటాయి కదా! విషయం ఇంతవరకు వచ్చింది అంటే మా అమ్మాయి కూడా అంతో ఇంతో చనువు ఇచ్చిందంటావా అనే ఆలోచన అప్పుడు రాలేదు నాకు.

ఇలాంటి విషయాల్లో నేను కొంచెం పట్టింపుగా ఉంటాను. పక్కవాళ్ళ పిల్లలైనా సరే వెళ్లి తల్లిదండ్రులని కూడా మందలిస్తాను. కొన్ని రోజులకి ఫోన్ కి దూరంగా అయింది. కాలేజీ లో ఒత్తిడి కొంచెం ఎక్కువగానే ఉండేది. మళ్ళీ ఫోన్ చేసినా, కలిసినా చదువు మానేస్తానని గొడవచెయ్యడం చేసేది. కనీసం మన ఊరులోనే వేరే కాలేజీ కి అయినా మార్పించండి అని బ్రతిమిలాడింది. మొదటి సంవత్సరం చివరకి వచ్చింది కదా! ఇంకొక్క సంవత్సరమే కదా అని ఒప్పించాను. మొదటి సంవత్సరాంత సెలవులు ఇచ్చారు. సెలవుల్లో తన పుట్టినరోజుకి తనకి ఎంతో ఇష్టం ఐన మొబైల్ గిఫ్ట్ గా ఇచ్చాను. ఏదోలాగా తనని సంతోషపరచి ఈ సంవత్సరం కాలేజీ కూడా నెట్టెయ్యాలని నా ఉద్దేశం. తనలో ఎప్పుడు లేనంత సంతోషం కనపడింది. ఇప్పుడు నేను రోజూ నచ్చజెప్పాల్సిన పని తగ్గింది కొంచెం.

కానీ తన ప్రవర్తనలో విపరీతమైన మార్పు. ఎప్పుడు చూసినా ఫోన్లోనే ఉండేది. ఎవరన్నా వస్తే దాచేసేది. పగలు రాత్రి అని తేడాలేదు. నేను వచ్చే టైం కి ఫోన్ పక్కన పెట్టి నటించేది.
" ఏంటండీ ? అది ఎప్పుడు చూసినా ఫోన్లోనే ఉంటోంది. కొత్తగా ప్రవర్తిస్తుంది. అర్ధరాత్రిలు కూడా మేడ మీదకెళ్ళి ఫోన్ తో ఉంటోంది. మీరు కొంచెం కనుక్కోండి. నాకు సమాధానం చెప్పట్లేదు. ఈ వయసులో ప్రేమ దోమ అంటూ అనవసరపు ఆకర్షణలు తప్పుదారి పట్టిస్తాయి" బాధగా చెప్పింది నా భార్య. "సరే నేను మాట్లాడతాను అన్నాను" తన రూమ్ వైపు వెళ్లేసరికి దుప్పటి ముసుగులో ఫోన్ చూసుకుంటోంది. నేను గమనించనట్లుగా పిలిచాను. పక్కన కూర్చొని మాట్లాడాను. ఈ మధ్య తన ప్రవర్తనలో వస్తున్న మార్పులు అన్నిటి గురించీ అడిగాను. ఎంతో ప్రేమగా ఉండే నువ్వు ఈ మధ్య మాతో టైం గడపడమే మానేసావు. ఏదన్నా రెండో సారి అడిగితే చాలు చాలా విసుగు ప్రదర్శిస్తున్నావు. అర్ధరాత్రి అపరాత్రి ఫోన్ తోనే ఉంటున్నావు. అని ఫోన్ తీసుకోబోయాను. వెనక్కి లాక్కుంది. నా మనసు కొంచెం చివుక్కుమంది. మా అమ్మాయి నాకు చాలా దూరం అయిపోయినట్లు అనిపించింది. మొహమాట పడకుండా అడిగేసాను.

"ఎవరినైనా ప్రేమిస్తున్నావా? అమ్మా " అని. నాకెలా తెలిసిందా అన్నట్లు చూసింది. వెంటనే తమాయించుకుని చెప్పింది.

" అలాంటివి ఏవి లేవు నాన్న... నేను పెళ్లి అంటూ చేసుకుంటే మీరు చూపించిన అబ్బాయిని మాత్రమే " అని చెప్పింది.

కొంచెంసేపు చాలా నమ్మకంగా మాట్లాడింది. నేను కూడా తనని నమ్మాను. కానీ ఒకరోజు జాబ్ పని మీద వేకువ ఝాము ట్రైన్ కి ఊరు వెళదామని మూడు గంటలకు నిద్ర లేచాను. బయలుదేరేముందు చూస్తే తను మా ఇంటి వాటర్ ట్యాంక్ మీద నిలబడి కనపడింది. గాభరా పడి పరిగెత్తాను. "ఏం లేదు డాడీ నిద్ర పట్టక సాంగ్స్ వింటున్నా" అని చెప్పింది. సరే వెళ్లి పడుకో అని చెప్పి స్టేషన్ కి బయలుదేరాను. ఆటో స్టేషన్ కి చేరుకునే దారిలో నా స్కూటీ కనపడింది. ఆటో తొందరగా ఆపమని చెప్పి అటు పరిగెత్తాను. అప్పుడే నా ఫోన్ కి ఒక మెసేజ్ వచ్చింది "క్షమించు డాడీ నీకు అబద్ధం చెప్పాను" అని. గుండె దడ పెరిగిపోయింది నాకు. అటు ఇటు పిచ్చివాడిలా పరిగెత్తాను. తను కనపడింది కానీ వేగంగా వస్తున్న రైలుకి ఎదురుగా నిలబడి. గట్టిగా అరుస్తూ పరిగెత్తాను తనని కాపాడుకోవాలని. నేను అందుకునేలోపు అందని దూరాలకు ఎగిరిపోయింది. వేగంగా వచ్చినా రైలు ఢీ కొట్టి తను చనిపోయింది. పక్కనే ఉన్న నా ముందు తన కుడి చెయ్యి వచ్చిపడింది. అందులో తన ఆత్మహత్య సెల్ఫీ వీడియో అప్లోడ్ అవుతూ కన్పించింది. నేను దిగ్భ్రాంతిలోనే ఫోన్ చేతిలోకి తీసుకోగానే ఒక మెసేజ్.

" FINAL ROUND COMPLETED. YOU WON THE GAME, BUT LOST YOUR LIFE"

" ఆటలో గెలుపొంది జీవితంలో ఓడిపోయావు" అనే మెసేజ్ ఎర్రని అక్షరాలతో కనిపించింది. అప్పుడుగానీ నాకు తెలియలేదు. ఈ మధ్య న్యూస్ లో చూపించిన బ్లూ వేల్ అనే ప్రాణాలు తీసే ఆట నా కూతురు కూడా ఆడింది అని. గతమంతా కళ్ళముందు మెదిలి నా తప్పులన్నీ కన్పించాయి. నా భార్యకి ఏమని చెప్పాలో, ఎలా చెప్పాలో, నిజం తెలిసాక తను ఏమైపోతుందో అనే భయాల మధ్య మా అమ్మాయి చేతిమీద బ్లేడ్ తో చెక్కిన బ్లూ వేల్ బొమ్మ "నీ బిడ్డ చేతిని బ్లేడ్ తో కోసుకున్నా కూడా పట్టించుకోలేనంత బిజీ గా మీలాంటి తల్లిదండ్రులు ఉండడం వల్లనే నాలాంటి గేమ్ కూడా మీమీద గెలిచింది" అని వెక్కిరింతగా నవ్వింది.

– వంశీ కమల్

# ప్రేమ పెళ్లి

మాది ప్రేమ పెళ్లి. మేము ప్రేమించుకున్నామని మా పెద్దవాళ్ళకి తెలియదు. అదృష్టవశాత్తు మా ఇద్దరికే పెళ్లి సంబంధం మాట్లాడడం ఇద్దరివైపు పెద్దలూ ఒప్పుకోవడం అన్నీ ఎవరో ముందుగా అనుకున్నట్లుగా జరిగిపోయాయి, అంతే. అందుకే అంటూ ఉంటాను జీవితం ఎవరో రాసిన కథలా ఉంటుంది అని. తనకి నేనంటే పిచ్చి అనడం కంటే నేనే తన ప్రపంచం అనడం సరియైనదేమో.

ఈ మధ్య తన ప్రేమలో కొంచెం తేడా కనిపిస్తోంది. నాతో గడిపే సమయం రోజు రోజుకు తగ్గిపోతోంది. పెళ్ళైన కొత్తలో ఉన్నంత ప్రేమ తరవాత ఉండదు అని అందరు అంటూ ఉంటే ఏదో అలా చెప్తారు కానీ మేము అలా కాదు అనుకున్నాను. కానీ వాళ్ళు అనుభవంతో చెప్పింది నిజమేమో అనిపిస్తోంది. వీలైనంత సమయం ఆఫీస్ లోనే గడిపేస్తున్నాడు. డబ్బు మీద కొంచెం ప్రేమ ఎక్కువైంది అనిపిస్తోంది. నన్ను గానీ, మా అమ్మా వాళ్ళని గానీ డబ్బులు అడగడం లాంటివి ఏమీ చెయ్యట్లేదు కానీ తన సమయాన్ని డబ్బులాగా మార్చాలని ప్రయత్నిస్తున్నాడని మాత్రం అర్థం అయింది. ఏది ఏమైతేనేం మేము ప్రేమతో ఎక్కువగా గడిపే సమయం అంతా తక్కువగా అయిపోతోంది. దూరం ఎక్కువగా అయిపోతోంది. వారాంతంలో ఎక్కడికైనా తీసుకెళ్తాడేమో అని ఆశపడతాను పార్ట్ టైం జాబ్ కి వెళ్ళాలి అంటాడు. ఆఫీస్ ఐయ్యాక నాతో సమయం గడిపితే బావుణ్ణు అనుకుంటాను. ఎవరికో సపోర్ట్ ఇవ్వాలి అంటాడు. ఏమన్నా అంటే నీకోసం అంటాడు. కానీ, నాకు అవేమీ అక్కర్లేదు నీతో గడిపే సమయం కావాలి అంటాను. అది మాత్రం ఇవ్వడు.

అలాంటి సమయంలోనే నా పాత స్నేహితుడు సంతోష్ మళ్ళీ సామాజిక మాధ్యమంలో దర్శనం ఇచ్చాడు. వీలున్నప్పుడల్లా మెసేజ్ చేసేవాడు. మొదట్లో పెద్దగా స్పందించకపోయినా నెమ్మదిగా నాకోసం సమయం కేటాయించే వారు దొరకడం నాకు చాలా ఒత్తిడిని దూరం చేసినట్లు అనిపించింది. సమయం ఉన్నప్పుడల్లా పాత విషయాలు, పాత మిత్రుల సంఘటనలు గురించి మాట్లాడుకునే వాళ్ళం. అలా నాకు సమయం తెలియనంత సమయం తనతో గడపడం జరిగేది. నెమ్మదిగా పర్సనల్ లైఫ్ విషయాలు కూడా మాట్లాడుకోవడం మొదలైంది. అన్ని విషయాలు పంచుకునే వాళ్ళం. ఒక మంచి

మిత్రుడు దొరికినందుకు చాలా సంతోషంగా అనిపించింది. ఒకరోజు కలుద్దాం అన్నాడు. సరే అన్నాను.

ఒక ఆదివారం ఇంటికి వచ్చాడు. ఆరోజే తెలిసింది. తను నానుండి ఏమి ఆశిస్తున్నాడో. చెప్పు చూపించి బయటకి పొమ్మన్నాను. అదే సమయానికి మా ఆయన వచ్చాడు. ఒక్క క్షణం గుండె ఆగినంత పని అయింది.

"రాత్రి చెప్పావ్ మీ ఫ్రెండ్ ఎవరో వస్తున్నారని ఈయనేనా ?" అంటూ నన్ను అడిగి " హలో నా పేరు రాఘవ్" అని పరిచయం చేసుకున్నారు. తొందరగా వెళ్లాల్సిన పని ఉంది అని చెప్పి సంతోష్ ఉడాయించాడు అక్కడ నుంచి. " ఎందుకు మీ ఫ్రెండ్ అకస్మాత్తుగా వెళ్ళిపోయాడు ? " అని రాఘవ్ అదోలా అడిగారు. ఏదో అబద్ధం చెప్పి తప్పించుకున్నాను. రాఘవ్ తన పని ఒత్తిడిలో పడిపోయి పట్టించుకోలేదు ఏమీ తెలియదు తనకి అనుకున్నాను. నాకు ఇదొక పెద్ద గుణపాఠం. ఎమోషనల్ గా వీక్ గా ఉన్న వాళ్ళని ఎలా లోబర్చుకోవాలా ? అని చూసే అబ్బాయిలు గురించి వార్తల్లోనే కాకుండా మొదటిసారి చూసాను. అయినా నాలాంటి అమ్మాయిలది కూడా తప్పు ఉంది. భర్త మనకోసం మనకొక అందమైన జీవితాన్నివాలని ఎంతో కష్టపడ్తూ ఉంటే ఇంకా తనకి వెన్నుదన్నుగా నిలవాల్సింది పోయి ఎవడో దారినపోయే దానయ్యలతో ముచ్చట్లు పెడతాం. అలాంటి పరిచయాలే లేనిపోని ఆలోచనల్ని పుట్టించి బంధాలని, జీవితాలని సర్వనాశనం చేస్తాయి. నాకు మొదట్లోనే ఇలాంటి అనుభవం జరగడం మంచిదిలే అనిపించింది. ఇకమీదట చాలా అప్రమత్తంగా ఉంటాను అనుకున్నాను. అన్నీ మనం అనుకున్నట్లు జరిగితే జీవితం ఎందుకు అవుతుంది?

నా భర్తకు ఒక శుభ వార్త చెప్పాలని కాల్ చేశాను. బిజీగా ఉన్నారు. చాలా సార్లు కాల్ చేసాక లైన్ దొరికింది. కానీ ఇంక అప్పటికి నాకు చెప్పాలి అనిపించలేదు.
" రాఘవ్ సాయంత్రం ఇంటికి త్వరగా రండి. మీకు ఒక మంచి వార్త చెప్పాలని ఎదురుచూస్తున్నాను. అది ఫోన్లో కాకుండా మీతోనే చెప్పాలి" అని చెప్పేశాను. కొంచెం ఆలోచిస్తే అర్థం అయి ఉండేది. కానీ, పని ఒత్తిడిలో ఉన్నారు ఏమో "సరే" అని ఫోన్ పెట్టేశారు. రాత్రి చాలా ఎదురు చూసాను. కానీ ఆయన

జాడ లేదు. ఫోన్ చేస్తే స్పందన లేదు. సుమారు రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో కాల్ చేసారు. కానీ ఆయన ఫోన్ నుండి మరెవరో లేడీ మాట్లాడింది. ఈ టైములో ఆయన ఫోన్ నుండి వేరే వాళ్ళు అదీ ఆడవాళ్లు మాట్లాడడం ఏంటో అర్థం కాలేదు.

" మేడం. రాఘవ్ గారికి చిన్న ప్రమాదం జరిగింది. మా హాస్పిటల్ లో జాయిన్ ఐయ్యారు. ఇప్పుడే స్పృహలోకి వస్తే మీకు కాల్ చేసి చెప్తున్నాం. " అని హాస్పిటల్ అడ్రస్ చెప్పారు. గుండెలో అగ్ని పర్వతం బద్దలైంది.

కొన్ని రోజులకి ఇంటికి తీస్కోచ్చాము. ఆయన ఇంకా సొంతంగా నడవలేడు. వీల్ చైర్ లోనే మిగిలిన జీవితం. పెళ్ళై ఇది రెండో సంవత్సరం. మా అమ్మా వాళ్ళు తెగ తెంపులు చేసుకుందాం వచ్చేయి మాతో అన్నారు. నేను ధృడంగా ఒక్కటే చెప్పాను.

" నా భర్త వేద మంత్రాల సాక్షిగా నాతి చరామి అని అగ్ని సాక్షిగా ప్రమాణం చేసాడు. నేను కూడా ఆయనకి అనుకూలవతిగా నడుచుకుంటానని, అన్ని విషయాల్లో సగమై తోడుంటానని తాళి కట్టించుకున్నాను. దానికే కట్టుబడి ఉంటానని చెప్పాను". నా ప్రేమ అర్థం అయిందో లేక నన్నో పిచ్చిది అనుకున్నారో తెలియదు. వెళ్లిపోయారు. ఆరోజు నుండి ఆయనకి అన్నీ నేనై తోడున్నాను. కానీ దురదృష్టం పాలు ఇంకా మిగిలే ఉంది అన్నట్లు రాఘవ్ ప్రవర్తనలో చాలా తేడా మొదలైంది. అవసరం అయినా కాకపోయినా కావాలని పిలవడం, ఊరికే నన్ను తిప్పించడం, విసిగించడం మొదలు పెట్టాడు. ఒక్క క్షణం నేను ఎదురుగా లేకపోయినా కూడా గట్టి గట్టిగా అరిచి పిలిచేవాడు. ఒక్కోసారి స్నానం చెయ్యడానికి వెళ్లి ఆలస్యం అయినా సరే గావు కేకలు పెట్టేవాడు. ఏంటి ఈ మనిషికి కృతజ్ఞతలేదు అనిపించేది. ఆయన కోసమే కదా నేను కష్టపడి సేవలు చేస్తోంది. ఇంటికి వచ్చి నెల కూడా కాలేదు నరకం చూపిస్తున్నాడు. సేవ చెయ్యడం పర్లేదు గానీ ఈ మానసిక హింసని జీవితాంతం ఎలా తట్టుకోవాలో అర్థం కాలేదు. ఒకరోజు చిరాకుతో విసుక్కున్నాను. అంతే మాటలు పెరిగిపోయాయి.

"ఆరోజు నీ స్నేహితుడు ఎందుకు వచ్చాడో నాకు తెలియదు అనుకున్నావా? నేను ఆరోజు తలుపు దగ్గరకు రాగానే వాడు నిన్ను ఏమి ఎదిగాడో నేను విన్నాను. నాకు పూర్తిగా తెలుసు మీ భాగోతం" అన్నాడు. ఒక్క క్షణం భూమి బద్దలైపోయింది అనిపించింది.
" నేనే తప్పు చెయ్యనప్పుడు అనవసరంగా నీ మనసుకు బాధ పెట్టె విషయం ఎందుకు? అని నీతో ఆ విషయం ఎప్పుడూ మాట్లాడలేదు. అయినా ఆరోజు మా మాటలు పూర్తిగా విని ఉంటే నువ్వు ఇలా మాట్లాడవు. " అంటూ నా తప్పు లేదంటూనే కోపం లో నేను కూడా విశ్వాసం లేదు నీకు ఇంత సేవ చేస్తున్నా కూడా అనేశాను.
" అన్నీ బాగున్నపుడే ఒకడు ఇంటికి వచ్చాడు. ఇప్పుడు నిన్ను ఎలా నమ్మాలి? నేను నీతో కలిసి ఉండలేను. " అని నానా యాగీ చేసి పెద్దల్లో పెట్టి, పెద్ద గొడవ చేసి విడాకుల వరకు తీసుకొచ్చాడు. బ్రతిమిలాడాను చాలా సార్లు ప్రాధేయపడ్డాను. తొందరలో నోరు జారినందుకు క్షమించమని కలిసుందామని బ్రతిమిలాడినా వినలేదు.

తను ఎంత గొడవ చేసినా ఇంతకు ముందు తను నాపై చూపిన ప్రేమే నాకు గుర్తొస్తోంది. కానీ ఒక్క నెల రోజులకే తనకి నామీద నమ్మకం లేని తనం వచ్చేసింది. తను అకస్మాత్తుగా దివ్యాన్గుడు అయిపోవడం వల్ల దాన్ని జీర్ణించుకోలేక అలా విపరీతంగా ప్రవర్తిస్తున్నాడని నా గట్టి నమ్మకం. కానీ కౌన్సెలింగ్ ఇప్పించే టైం కూడా నాకు ఇవ్వట్లేదు. ఎలా అయితేనే మొత్తానికి తన కోరిక మేరకు మేము విడిపోయాము. చాలా ప్రేమ ఉన్నా కూడా నన్ను ఇంతలా దూరం చెయ్యడం అతని మీద చాలా కోపం వచ్చేలా చేసింది. ఎప్పటికీ తనని నేను క్షమించలేను.

– అంటూ తన జీవితంలో ఎదురైనా ఒడిదుడుకులు దూరం ఐన ప్రేమా వయసుకొచ్చిన తన కూతురు శ్లోక కు వివరించి చెప్పింది శశిరేఖ.
" క్షమించలేననే మాట మాత్రం అనకమ్మా " అంటూ ఏడ్చేసింది శ్లోక
" ఏమైందమ్మా ? ఎందుకు ఏడుస్తున్నావు ? అయినా ఎందుకు ఇవాళ ఇవన్నీ అడుగుతున్నావు ? " ప్రశ్నలు కురిపించింది యాభై ఏళ్ళ శశిరేఖ

ఇవాళ కాలేజీ ఫ్రెండ్స్ తో కలిసి ఒక ఓల్డ్ ఏజ్ హోమ్ కి వెళ్ళాం అమ్మా. నీ ప్రతి బర్త్ డే కి వచ్చే నువ్వు ఈ ఇయర్ ఎక్కడికీ రాలేను అన్నావు కదా! సరే అని కేక్, ఫ్రూట్స్ తీసుకెళ్లి పంచిపెట్టాం. అందరు తీసుకున్నారు కానీ ఒకరు తీసుకోలేదు. ఒంటరిగా కూర్చుని బాధపడుతున్నారు. నువ్వు చెప్పావు కదా! ఇలాంటి వాళ్ళు మనం ఇచ్చే వాటికోసం కన్నా మనస్పూర్తిగా మాట్లాడే వాళ్ళ కోసం చూస్తారని. సో ఆయన దగ్గరకి వెళ్లి కూర్చుకున్నాను. చాలా సేపటికి తమాయించుకుని నాతో మాట్లాడడం మొదలు పెట్టారు.

" మనసులో బాధ ఎవరికన్నా చెప్తే తగ్గిపోతుంది. ఈ వయసులో మీరు బాధని మొయ్యడం కన్నా మీ బిడ్డలాంటిదాన్ని అనిపిస్తే నాతో షేర్ చేస్కోవచ్చు. కాస్త రిలాక్స్ అవుతారు." అన్నాను. ఆయన నువ్వు నాకు చెప్పినదంతా చెప్పారు అమ్మా (ఇంకొంచెం ఏడుస్తూ). ఆరోజు మీ ఫ్రెండ్ తో నువ్వు చెప్పిన ప్రతి మాట అక్షరం పొల్లు పోకుండా ఇంకా గుర్తు పెట్టుకుని చెప్పారమ్మా. ఒక స్నేహితుడుగా దగ్గరైతే అతను నీకు వేరే ఉద్దేశంతో దగ్గరయ్యాడని. అది నువ్వు గ్రహించి నీ తప్పు తెల్సుకుని బయటకి పొమ్మన్నావని చెప్పారమ్మా. ప్రతి పురుషార్థంలో ఆయనెలా అయితే నాకు తోడుంటానని ప్రమాణం చేసారో నేను కూడా ఆయనలో సగంలాగా బ్రతకడానికి పుట్టానని నువ్వు చెప్పినపుడు నాన్నకి కళ్ళు చెమర్చాయిట అమ్మా. అందుకే చిన్న వయసులో నీ జీవితం ఆయన చక్రాల కుర్చీలో పడి తిరగకూడదని కావాలని నీకు దూరంగా వెళ్లిపోయానని చెప్పారు. తన జ్ఞాపకంగా నీ దగ్గర ఏదీ ఉంచకుండా తీస్కెళ్లిపోయాననీ అలా అయినా తనని మర్చిపోయి ఇంకో పెళ్లి చేస్కుని సంతోషంగా ఉంటావనుకుని దూరం వెళ్లిపోయారమ్మా" అంటూ ఏడుస్తూ చెప్తుంటే. శశి రేఖ కూడా ఏడుస్తూ కూతుర్ని పట్టుకుంది.

"జ్ఞాపకాలు అన్నీ తీస్కెళ్లిపోయాను అనుకుంటూ... అయన ప్రతి రూపం అయిన నిన్ను నాకు ఇచ్చి, నిన్ను చూసుకుంటూ బ్రతకమని వెళ్ళిపోయాడు అమ్మా మీ నాన్న. ఆయనకి అంకితం అనుకున్న జీవితంలో ఇంకో మగవాడిని ఎలా ఊహిస్తాను అనుకున్నారమ్మా ? పద వెళ్దాం... ఎక్కడున్నారు " అంటూ కళ్ళ నీళ్లు తుడుచుకుంటూ పరుగుపెట్టింది శశిరేఖ.

జీవితంలో ఏం జరిగినా, ఏం కోల్పోయినా రాఘవ్ లో సగం అయి తోడు నీడగా నడవాలి అనుకునే శశిరేఖ. తను ప్రాణంగా ప్రేమించిన వ్యక్తి కి దూరంగా ఉండడం అనే కష్టాన్ని కూడా ఇష్టం గా భరిస్తూ తన సంతోషం కోసం ఏదైనా కోల్పోవడానికి సిద్ధంగా ఉండే రాఘవ్. మరి కొద్ది సేపటిలో కలుసుకోబోతున్నారు.

వివాహ బంధం నిజమైన అర్థం తెలుసుకుని ఎప్పుడూ ఒకటిగా నడిచే నిత్య ప్రేమికులకు ఈ కథ అంకితం చేస్తూ....

– వంశీ కమల్

# మానవత్వం

చాలా చిన్న వయసులోనే నేను ఇల్లు వదిలి వచ్చేశాను. తమని తాము సాకుకోడానికే ఇబ్బంది పడుతున్న నా తల్లిదండ్రులకి నేను ఇంకో భారం కాకూడదు అనుకున్నాను. పైగా అప్పటి నా మానసిక స్థితికి ఎవరినీ నమ్మే పరిస్థితిలో గానీ, వాళ్ళ మీద ఆధారపడే పరిస్థితిలోగానీ లేను. నా సంఘర్షణ నాది.

అలాంటి పరిస్థితిలో ఉండగా వహీదా గారు అని నాకు జీవితాన్ని ఇచ్చారు. ఆకలి, అనారోగ్యంతో అలమటిస్తున్న నాకు ఆసరాగా నిలిచారు. ఆవిడ సినిమాల్లో పని చేస్తారట. సిమ్రన్ అక్క ఋణం తీర్చుకోలేను. అక్కే నన్ను వహీదా గారి దగ్గరకి తీసుకెళ్లింది. నా పరిస్థితి నాకు చెప్పుకోడం కూడా రావడంలేదు. అక్క చెప్పడం వల్లనే ఆరోజు ఆవిడ ఆకలి తీర్చి, ఆరోగ్యం ఇచ్చి, సొంత డబ్బుతో అవసరం అయిన ఆపరేషన్ కూడా చేయించింది. సుమారు రెండున్నర లక్షలు ముక్కూ మొహం తెలియని నాకు ధారపోసింది ఆ తల్లి. సిమ్రన్ అక్క వాళ్ళు ఉండే చోటుకి తీస్కుని వెళ్ళింది. వాళ్ళ వాళ్ళని పరిచయం చేసింది. అందరు చాలా మంచివారు నన్ను చాలా ఆదరించారు. ఈ సమాజంలో ఎలా ఉండాలి ? ఎలా ఉండకూడదు అని చాలా నేర్పించారు. కానీ రాతని ఎవరూ తప్పించలేరు అన్నట్లు సుబ్బరాజు నా జీవితంలోకి వచ్చాడు.

నన్ను పెళ్లి చేసుకుంటానన్నాడు. జీవితం ఇస్తాను అన్నాడు. నా గురించి అంతా తెలిసే మాట్లాడుతున్నావా అని అడిగాను. తనకి అంతా తెలుసని, నాకు నీ మంచితనం తప్ప ఇంక ఏమీ అవసరం లేదు అని చెప్పాడు. ఈరోజుల్లో మంచివాడు ఉన్నా కూడా నటిస్తున్నాడేమో అని అనుమానించే పరిస్థితులు. కానీ సుబ్బరాజు ఉన్నతమైన భావాలు నన్ను కాదు అననివ్వలేదు. ఒక మగాడి అవసరం, తోడు కూడా జీవితానికి ఉండాలి కదా అనిపించింది.

మా పద్ధతుల ప్రకారం పెళ్లి చేసారు. నేను నా బతుకుని చూసుకుని మురిసిపోయాను. సుబ్బరాజు రోజు ఉదయాన్నే వస్తాడు ఒక నాలుగు ఐదు గంటలు మాత్రమే నాతో ఉంటాడు. తర్వాత పనికి వెళ్ళిపోతాడు. వారం కూడా తిరగకుండానే వాడికి తాగుడు అలవాటు బాగా ఉందని తెలిసింది. మొగుడు కదా భరించేదాన్ని. ఒకసారి కూడా నాకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోయినా నా సంపాదనతోనే నెట్టుకొచ్చేదాన్ని. నెమ్మదిగా గొడవలు మొదలయ్యాయి. నన్ను డబ్బుల కోసం వేధించడం మొదలు పెట్టాడు.

"నువ్వు ఎంత అడిగినా నేను డబ్బు ఇవ్వను. అది నా సంపాదన. నీకు హక్కు లేదు" తెగేసి చెప్పాను

"ఇవ్వకపోతే గుంజుకుని పోతాను. అయినా నాకు కాకపోతే ఇంకెవరికి ఉంటాదే హక్కు " ప్రశ్నించాడు.

"నీ పెళ్ళానికి ఉంటాది రా నీ పెళ్ళాన్ని అడుగు &★#%$#%&★" అని తిట్టాను

ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు.

" నాకు ముందే తెలిస్తే ఎప్పుడో తన్ని తరిమేసేదాన్ని రా. పెళ్లి అయి పెళ్ళాం ఉండి నన్ను పెళ్లి చేసుకున్నావ్. పైగా డబ్బులు గుంజుకుంటున్నావ్. ఛీ నీ బతుకు " గట్టిగానే తిట్టేసాను.

"డబ్బు కోసం కాకపోతే నీలాంటిదాన్ని ఎవడు పెళ్లి చేసుకుంటాడే %&★^$ దానా " అంటూ బయటపడిపోయాడు.

ఒక్క ఉదుటున మెడ పట్టి బయటకి గెంటేసాను. అదే నేను చేసిన తప్పు. ఆ తోపులాటలో నా చేతిలో ఉన్న డబ్బుమూట విసురుగా లాక్కుని బైట పడిపోయాడు. పైగా తలుపుకి గొళ్ళెం వేసి పారిపోయాడు. సుమారు తొమ్మిది సంవత్సరాల నా సంపాదన ఆ దుర్మార్గుడి సొంతం అయిపోయింది. తర్వాత వాడు ఏమైపోయాడో తెలియదు.

చుట్టు పక్కల వాళ్ళు జాలి చూపినా నాకు నామీద జాలిగా ఏమీ అనిపించలేదు. మగజాతి అంటే అసహ్యం పట్టుకుంది అంతే. అక్కా వాళ్ళు ఇంకో పెళ్లి చేసుకోమన్నారు కానీ నాకు ఇంకా మనసు రాలేదు. అలానే జీవితం వెళ్ళబోస్తున్నాను. కొన్ని సంవత్సరాల తర్వాత సుబ్బరాజు మళ్ళీ కన్పించాడు కానీ ప్రాణాలతో కాదు. రోడ్డు ప్రమాదంలో మరణించి కనిపించాడు. వాడి భార్య అనుకుంట పక్కన

విగత జీవిగా పడి ఉంది. గుక్క పెట్టి ఏడుస్తూ పసి పాప ఉంది. చుట్టూ సుమారు పాతిక మంది 'మగాళ్లు' ఉన్నారు. ఒక్కడిలోనూ చలనం లేదు. దారినపోతూ కొందరు ఆడాళ్ళు చూస్తున్నారు. ఒక్కరు కూడా ఆగలేదు.

సాయం చెయ్యండయ్యా లాక్కెళ్లి కప్పెడదాం అని అడిగాను ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ఈ మగాళ్లు. అక్కకి ఫోన్ చేశాను. కొందరు కుఱ్ఱాళ్ళని తీస్కొని వచ్చింది. కార్యక్రమాలు పూర్తి ఐయ్యాయి. మూడో రోజు అక్కని అడిగాను నన్ను ముండమోపించమని.
" ఎందుకే నీకు ? వాడు వల్ల ఏం పొందినవని ?" అని అడిగింది అక్క .
" ఏం పొందినా పొందకున్నా తాళి కట్టిండు కదా ? దాని విలువ దానికే ఇయ్యాల. కాదనకు" అన్నాను.
ఆ తంతుకూడా అయిపోయింది.
" గా బిడ్డని ఏం జేద్దాం ?" అని అక్క అడిగింది
" నే పెంచుకుంటా " అన్నాను
" నువ్వా ? నీకే గంజి లేదు. దీన్నెట్లా సాకుతవ్ ?" ఏదన్న ఆశ్రమంలో చేరుద్దామని అక్క చెప్పింది.
" ఇన్నాళ్లు నేనెట్ల బతికిన్నో గట్లనే సంపాయిస్తా. ఎవడన్నా పనిస్తే జేస్తా. లేదంటే రైళ్లలో, రాస్తాల్లో టాప్, టప్ మని చప్పట్లు గొడ్తూ వచ్చిన పది పరక బెట్టి సదివిస్తా. బయట మనుషులు మనంత మంచిగ లేరక్కా. మగాళ్ళకి బాధ్యత గనపడలా, ఆడోళ్లకి బాధ కనపడలా, వాళ్ళకి దూరంగా ఉండడం వల్లనో ఏమో మనమే కొంచెం మనుషులెక్క ఉన్నాం. చూసినం కదా! దీని బాబు చచ్చి పడుంటే ఒక్కరు కూడా చలించలే. అందుకే మనమే సాకుదాం." అంటూ దగ్గరకి తీసుకున్నాను.

– వంశీ కమల్